PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 271 | విజయవాడ, ఆదివారం 4 మే 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 4 May 2025 | Rs

రాకేష్ టికాయత్‌పై మూక దాడి

- 'మోడీ.. మోడీ' నినాదాలు చేస్తూ తలపాగా విసిరేసిన సంఘ్ గూండాలు
- నిరసనగా మహా పంచాయత్
- భారీగా తరలివచ్చిన రైతులు

7

భళా బెంగళూరు

- గెలుపు ముంగిట చెన్నై బోల్తా
- సూపర్‌కింగ్స్‌పై విజయంతో టాప్‌లోకి ఛాలెంజర్స్



8

మరో కొండకు టెండర్

విశాఖ జిల్లా ఆనందపురంలో ఖనిజాల కోసం కొనసాగుతున్న గాలింపు

- గ్రామసభ జరపకుండానే అడ్డగోలు క్వారీయింగ్‌కు సన్నాహాలు
- పర్యావరణం, గిరిజనుల ఉపాధిపై పెను ప్రభావం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

మొన్న విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని కుసులవాడ.. నేడు అదే మండలంలోని ఇచ్చాపురం.. విషయం ఒక్కటే.. కొండలను తవ్వేసి ఖనిజాలను దోచుకోవడమే. అటవీ ప్రాంతాల పర్యావరణాన్ని దెబ్బ తీసే కుట్రలను పాలకులు ఆపడం లేదు. ఇక్కడ ఎలాంటి గ్రామ సభనూ జరపలేదు. గిరిజనుల అభిప్రాయం తీసుకోలేదు. ఆ కొండపై క్వార్ట్‌జైట్ ఖనిజాల తవ్వకాలతో రూ.కోట్లకు పడగలెత్తి గిరిజనం ఉపాధిని దెబ్బకొట్టే కుట్రలకు ఓ కంపెనీ తాజాగా టెండరు వేసింది. ప్రకృతి సంపదలైన కొండలు, వాటిపై పోడు చేసుకుని ఉపాధి పొందే ఆదివాసీల హక్కులూ ఇలా అన్నీ ఇక్కడ 'బుల్డోజ్' అయిపోతున్నాయి.

ఆనందపురం గ్రామీణంపై కార్పొరేట్ల కళ్లు పడ్డాయి. ఇక్కడి కొండలను మైనింగ్ క్వారీయింగ్ కోసం అక్రమంగా అనుమతులు పొందడం కొనసాగుతోంది. అడ్డగోలుగా అనుమతులను మంజూరు చేయడంతో ఈ ప్రాంత గిరిజనం ఆవేశంతో అట్టుడికిపోతోంది. రాష్ట్రంలోని 'టిడిపి కూటమి' ప్రభుత్వం గిరిజన చట్టాలను పూర్తిగా గాలికొదిలేసింది. తాజాగా ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలోని ఇచ్చాపురం గ్రామంలో దెయ్యాలమెట్ట కొండపై ఇలాంటి కుట్రలకు ప్రభుత్వం తెర తీసింది. ప్రకృతి అందాలు, గలగల పారే సెలయేళ్లు, చుట్టూ కొండల నడుమగల ఇచ్చాపురం గిరిజన గ్రామం 55 గడపతో ఉంది. దీనికి సమీపంలోనే దెయ్యాలమెట్ట కొండతోపాటు కోతికొండ, మర్రిమెట్ట, ధారకొండ ఉన్నాయి. ప్రకృతి సిద్ధమైన వాగులు, పచ్చని చెట్లు, జీడి, మామిడి తోటలు, పత్తి పంటలతో అలరారుతున్నాయి. నాలుగువైపులా ఉన్న కొండలు ఇచ్చాపురానికి రక్షణ కవచమనే చెప్పాలి.



విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని దెయ్యాలమెట్ట కొండ

కొండపై సర్వే రాళ్లతో గిరిజనంలో ఆందోళన

గత నెల 29న విజయవాడ మైనింగ్ డిపార్టుమెంట్, సర్వే అధికారులు ముగ్గురు ఇచ్చాపురంలోని దెయ్యాలమెట్ట కొండ దగ్గరకు కార్లలో వచ్చి కొండపై కొన్నిచోట్ల సర్వే రాళ్లు పాతి, మార్కింగ్ చేసి వెళ్లారు. ఆ క్రమంలోనే కొండను క్వారీయింగ్ చేయబోతున్నట్లు ఆ ప్రాంతంలోని వారితో చెప్పారు. 'ప్రజాశక్తి' ఈ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటన చేసి కొండను తవ్వేసే కుట్రలపై ఆరా తీసింది. అక్కడి గిరిజనుల్లో తీవ్ర ఆందోళన కనిపించింది. 'ప్రభుత్వాలు మమ్మల్ని బతకనివ్వవా?, కొండలను తీసేస్తారా?' అని ఆవేదన వెలిబుచ్చారు. ఇదే మండలంలోని చిన్నయ్యపాలెంలో సర్వే నెంబర్ 104లో క్వార్ట్‌జైట్, రఫ్ స్టోన్, గ్రావెల్ తవ్వకాల కోసం గతంలో ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ముక్తకంఠంతో అడ్డుకున్న విషయం తెలిసిందే. తాజాగా అక్కడికి సమీప ప్రాంతంలో మరో కొండపై మైనింగ్ చర్యలు ప్రారంభమవడం ఇక్కడి వాసులను కలవరపరుస్తోంది.

టెండరు వివరాలు..
తాజాగా ఏం జరుగుతోంది ?

ఇచ్చాపురం గిరిజన గ్రామ సమీపంలోనే దెయ్యాలమెట్ట కొండ సర్వే నెంబరు 37/పిలో సుమారు 400 ఎకరాల వరకూ అంతా కొండే. ఇక్కడ దాదాపు 15 ఎకరాల్లో 2022 సెప్టెంబర్ 13న రాష్ట్ర డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ డిపార్టుమెంట్ వద్ద ఇ-వేలంలో క్వార్ట్‌జైట్ నిక్షేపాల క్వారీయింగ్‌కు అనుమతులను పొందారు. అగ్నిసుముఖ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్లాన్ సమర్పించింది. కానీ, పర్యావరణ అనుమతులు తీసుకోలేదు. 20 ఏళ్ల పాటు ఈ లీజు ఉంటుందని రాష్ట్ర మైనింగ్ శాఖ పేర్కొంది. మైనింగ్ ప్లాన్‌ను లీజుదారుకు అనుమతి వచ్చిన 2022 నుంచి మూడేళ్లలోపు ఎపి పొల్యూషన్ బోర్డు నుంచి, అటవీశాఖ నుంచి పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. ఈ నేపథ్యంలో మిగతా 2లో

పాక్‌తో వాణిజ్యం, సముద్ర రవాణా రద్దు

- మెయిళ్లు, పార్శిళ్ల డెలివరీలపై నిషేధం

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్తాన్‌పై భారత్ పలు కీలక నిర్ణయాలు, చర్యలు తీసుకుంది. వాయు, ఉపరితల మార్గాల ద్వారా పాకిస్తాన్ నుండి వచ్చే మెయిళ్లు, పార్శిళ్లను నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశం నుండి వచ్చే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై కూడా నిషేధాన్ని విధించింది. దేశంలోని అన్ని ఓడరేవుల్లోనూ పాక్ నౌకలు లంగరు వేయకుండా నిషేధించింది. దేశ భద్రత, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే అమల్లోకి వచ్చేలా పాక్ నుండి వచ్చే అన్ని దిగుమతులను నిషేధిస్తున్నట్లు సంబంధిత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు విదేశీ వాణిజ్య విభాగ డైరెక్టరేట్ జనరల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. తాజా నిర్ణయాలు, చర్యలతో పాకిస్తాన్ నుండి భారత్‌కు వచ్చే అన్ని రకాల షిప్‌మెంట్లు పూర్తిగా నిలిచిపోనున్నాయి. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఈ నిషేధాజ్ఞలు అమల్లో వుంటాయని అధికారులు పేర్కొన్నారు. 2019లో పుల్వామా ఉగ్ర దాడి తర్వాత భారత్, పాక్‌లు తీసుకున్న చర్యలతో ఇప్పటికే ఇరు దేశాల మధ్య వాణిజ్యం బాగా తగ్గిపోయింది. తాజా చర్యలతో అది కూడా నిలిచిపోనుంది. ఇందుకు ప్రతిగా పాకిస్తాన్ కూడా భారత్‌తో అన్ని రకాల వాణిజ్య కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. తృతీయ దేశం నుండి పాకిస్తాన్ ద్వారా వచ్చే రవాణా కూడా నిలిచిపోనుంది. పాక్ జెండాతో వచ్చే నౌకలు భారత ఓడరేవుల్లో లంగరు వేయడానికి కుదరదని, భారతీయ జెండాతో ఏ నౌక పాకిస్తాన్ పోర్టుల్లోకి ప్రవేశించదని పాకిస్తాన్ స్పష్టం చేసింది. ఇప్పటికే పాక్ విమానాలకు గగనతలాన్ని మూసివేసిన భారత్ తాజాగా సముద్ర జల రవాణా మార్గాలను కూడా మూసివేసింది. గత వారం పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో వాఘా-అట్టారి సరిహద్దును కూడా మూసివేయడంతో పాక్‌తో వాణిజ్యం పూర్తిగా స్తంభించిపోయింది.



తొక్కిసలాటలో గాయపడ్డవారికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

గోవా ఆలయంలో తొక్కిసలాట


ఏడుగురు మృతి, 65 మందికి పైగా గాయాలు

పణజి : ఉత్తర గోవాలోని షిర్‌గావ్ గ్రామంలో శనివారం తెల్లవారు జామున దారుణం చోటు చేసుకుంది. శ్రీ లైరాయ్ దేవి ఆలయంలో తెల్లవారు జామున 3.30గంటల సమయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు మరణించగా, 65మందికి పైగా గాయపడ్డారు. వీరిలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు, పురుషులు వున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా వున్నందున మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుందని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు. గాయపడిన వారి సంఖ్య ఇంకా ఎక్కువే వుండవచ్చని ఆందోళన చెందుతున్నారు. సమీప ఆస్పత్రుల్లో గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఆలయంలో ఏటా జరిగే జాతరకు గోవా, మహారాష్ట్రల వ్యాప్తంగా వేలాదిమంది యాత్రికులు హాజరయ్యారు. శుక్రవారం ఈ జాతర ప్రారంభం కావడంతో తెల్లవారుజాము నుండే పోటెత్తారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పరిస్థితి మరీ తీవ్రమెందని పోలీసు అధికారి అరుణ్ దేశాయ్ తెలిపారు. ఒక వ్యక్తి కిందపడి దొర్లుకుపోగా మరికొంతమంది వ్యక్తులు ఆ వ్యక్తిని తొక్కుకుంటూ వెళ్ళిపోవడంతో ఒక్కసారిగా తొక్కిసలాట మొదలై వుంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ జాతర కోసం ఆరు పోలీసు స్టేషన్ల నుండి వెయ్యి మందికి పైగా సిబ్బందిని మోహరించినట్లు చెప్పారు.

ఈ జాతర సందర్భంగా అగ్నిదివ్య పేరుతో నిప్పులపై నడిచే ఆచారం వుంది. ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఆచారాన్ని పాటిస్తారు. ఈసారే ఇలాంటి ప్రమాదం జరగడం విచారకరమని స్థానిక రిటైర్డ్ స్కూల్ టీచర్ రమేష్ (74) వ్యాఖ్యానించారు.

ఘటనపై సమగ్ర దర్యాప్తు : గోవా సిఎం సావంత్

గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఈ విషాద ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. గోవా జిల్లా ఆస్పత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు మిగతా 2లో



అల్లూరి జిల్లా రాజవొమ్మంగి వ్యవసాయ శాఖ కార్యాలయంపై పడిన మామిడి చెట్టు


వర్షబీభత్సం

- అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో విరిగిపడిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- శ్రీసత్యసాయి జిల్లాలో ఉద్యాన పంటలకు నష్టం

5

మరో విద్యుత్ భారం

- 'యాక్సిస్'తో పిపిఎకు ఆమోదం
- యూనిట్ రూ.4.60 చొప్పున కొనుగోలు
- 25 ఏళ్ల పాటు ఒప్పందం



ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలపై మరో విద్యుత్ భారం పడనుంది. అత్యంత ఖరీదైన విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి (పిపిఎకు) ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఆమోదం తెలిపింది. రాజకీయ పార్టీలు, విద్యుత్ రంగ నిపుణులు చెప్పిన అభ్యంతరాలను పట్టించుకోలేదు. యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌పిడిసిఎల్ మధ్య యూనిట్ రూ.4.60 చొప్పున జరిగిన పిపిఎకు ఎపిఇఆర్‌సి ఆమోదం తెలుపుతూ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. 400 మెగావాట్ల విద్యుత్‌ను ఆ కంపెనీ నుంచి 25 ఏళ్ల పాటు కొనుగోలు చేసేలా కమిషన్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఒప్పందం వల్ల విద్యుత్ వినియోగదారులపై సుమారు రూ.15వేల కోట్ల భారం పడనుంది. విద్యుత్ తక్కువ ధరకు లభిస్తున్నా... ఆ ఒప్పందాన్ని తిరగదోడి, అధిక ధరకు ఈ ఒప్పందాన్ని అమల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఏమిటని విద్యుత్ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. 2018లో టిడిపి ప్రభుత్వ హయాంలో ట్రిపుల్ బి స్కీం కింద ఎస్‌పిడిసిఎల్, యాక్సిస్ మధ్య ఎంఓయు జరిగింది. అనంతరం కోర్టు కేసుల కారణంగా ఈ ఒప్పందం పక్కకు పోయింది. 2022లో ఎస్‌పిడిసిఎల్ ఈ ఒప్పందాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కమిషన్‌కు ప్రతిపాదన పంపింది. అవసరమైన విద్యుత్ కోసం కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో సంస్థలను ఎంపిక చేయాల్సి ఉన్నా, డిస్కంలు మరోసారి ప్రతిపాదించాయి. ఈ ఒప్పందం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతుందని విద్యుత్ వినియోగదారులతోపాటు రాజకీయ పార్టీలు విమర్శించాయి. యాక్సిస్ కొనుగోలుపై కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో అభ్యంతరాలు వెల్లడించినా పట్టించుకోలేదని తెలిపాయి.

రాజధాని కోసం...

ప్రపంచ ప్రఖ్యాత డిజైన్లు

ఆర్కిటెక్చర్ సంస్థలతో నారాయణ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగరంలో నిర్మించే భవనాలు ప్రపంచ ప్రఖ్యాత డిజైన్లతో ఉండాలని, రాజీపడొద్దని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాజధానికి డిజైన్లు అందిస్తున్న నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్, ఎల్‌అండ్‌టి సంస్థల ప్రతినిధులతో సిఆర్‌డిఎ కార్యాలయంలో ఆయన సమావేశం అయ్యారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, ఇతర నిర్మాణాల్లో ఆధునికత ఉట్టిపడేలా ఉండాలని సూచించారు. గ్రీన్ బిల్డింగ్ తరహాలో నిర్మిస్తున్న భవనాలకు తగిన విధంగా రూపకల్పన ఉండాలని సూచించారు.

దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా డిజైన్లు సిద్ధం చేయాలన్నారు. దీనిపై ఆయా సంస్థల ప్రతినిధులు వారు రూపొందించిన డిజైన్లకు సంబంధించిన పద్ధతి, అలా ఎందుకు ఏర్పాటు చేశామనే అంశాలను మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడు తూ.. వీలైనంత త్వరగా వాటిని ఖరారు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పున:ప్రారంభ పనులు మొదలైన నేపథ్యంలో ఆలస్యం చేయడానికి వీల్లేదని సూచించారు. అయితే ప్రస్తుతం ఉన్న ప్లాను నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ఇచ్చిన నేపథ్యంలో వాటిని మెరుగుదల చేయడం, మరింత అధునాతనంగా రూపొందించే అంశంపై మంత్రి నారాయణ పలు సూచనలు చేశారు. గతంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి మాకీ అసోసియేట్స్, నార్మన్ ఫోస్టర్స్, వాస్తుశిల్పి సంస్థలు ప్రణాళికలు రూపొందించాయి. వీటిల్లో తొలుత మాకీ అసోసియేట్స్ ప్లాను ఎంపిక చేశారు. అనంతరం వాటిని వద్దనుకున్నారు. తరువాత నార్మన్ ఫోస్టర్స్ రూపొందించిన ప్లానును ఆమోదించారు. ప్రస్తుతం అదే ప్లానును అమలు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి పైలాన్



అమరావతి 'కాల-చక్ర'

గిరిపుత్ర

రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున:ప్రారంభం పేరిట శుక్రవారం నాటి భారీ కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర పాలకుల పరస్పర పొగడ్తలు ఒకవైపు, ప్రజలను మభ్యపుచ్చడం మరోవైపున ఏకకాలంలో జరిగిపోయాయి. పదేళ్ల క్రితం అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ తాజాగా ఆ పనులనే పున:ప్రారంభించారు. అట్టహాసంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలోనే ఆయన రూ. 58 వేల కోట్ల విలువ చేసే 92 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు వర్చువల్‌గా చేశారు. ఇందులో గుంతకల్ సమీపంలోని రోడ్ ప్రాజెక్టు మొదలు నాగాయలంక క్షిపణి ప్రయోగ కేంద్రం వరకూ అనేకం ఉన్నాయి. వాటిలో కొన్ని కేంద్ర ప్రభుత్వానివి కాగా అత్యధికం రాష్ట్ర ప్రాజెక్టులే! ఇవన్నీ రాజధాని అమరావతికి సంబంధించినవేనన్న రీతిలో బిల్డప్ ఇవ్వడం మరో ప్రత్యేకత.

మాట మార్చిన మోడీ

తిరుపతి వెంకన్న సాక్షిగా 2014 ఎన్నికల సభలో 'ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తాం' అని రాష్ట్ర ప్రజలకు హామీనిచ్చిన మోడీ ఆ మాట ఈ పదేళ్లలో దాదాపు మర్చిపోయారు. కానీ శుక్రవారంనాటి సభలో 'గత పదేళ్లుగా అమరావతికి అన్ని విధాలా సంపూర్ణ మద్దతునిస్తున్నాం' అని కొండంత అబద్ధం చెప్పడం ఆయనకే చెల్లింది. జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల విచ్ఛిన్నకర ప్రతిపాదన తెచ్చినపుడు దాన్ని కేంద్రం వ్యతిరేకించలేదు. పైపెచ్చు రాజధాని విషయం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినదేనంటూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఒక అఫిడవిట్ దాఖలు చేసి నాటి ముఖ్యమంత్రికి పరోక్ష మద్దతునిచ్చిన చరిత్ర చెరిగిపోతుందా? కనుక ఆనాటినుండి ఈనాటివరకూ కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతి రూపుదాల్చడానికి సహకరించింది లవలేశ మాత్రమూ లేదు. తొలుత శంకుస్థాపనకు వచ్చినప్పుడూ ప్రధాని పిడికెడు మట్టి చెంబుడు నీళ్లు తెచ్చారుతప్ప రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదు. తగుదునమ్మా అంటూ ఇప్పుడు సంపూర్ణ సహకారం అని చెప్పినంత మాత్రాన జనం నమ్ముతారా!

మూడేళ్లలోనే నిర్మిస్తాం...!

'అమరావతి పనులు మూడేళ్లలోనే పూర్తి చేసి ప్రధాని మోడీ చేతులమీదుగా ప్రారంభిస్తామ'ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభలో గొప్పగా ప్రకటించారు. అయితే ఈ పనులకు అవసరమైన సొమ్ములో కేంద్ర ప్రభుత్వం ఏమిస్తుంది? రాష్ట్రం భరించాల్సినదేమిటి అన్న వివరాల్లేవు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని నిర్మించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. కానీ రాష్ట్ర విభజన అమలులోకొచ్చిన నాటి నుండీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీ ఈ బాధ్యతను నెరవేర్చిన దాఖలాల్లేవు. తొలినాళ్లలో మంజూరు చేసిన రూ.1,500 కోట్లు మినహా ఇంకే నిధులూ రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇవ్వని విషయం అందరికీ తెలిసిందే! ఇప్పుడయినా ఈ నిర్మాణాల్లో వేటికి కేంద్రం ఎంత ఇస్తుందో రాష్ట్ర పెద్దలు అడగాలి కదా! అలాంటిదేమీ లేదు. ఇప్పటికి ఉన్న సమాచారం ప్రకారం రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తదితర సంస్థల నుండి అప్పులు లేదా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 50 సంవత్సరాల అప్పు అన్నది కఠోర వాస్తవం. కేంద్రం గ్రాంటుగా ఇవ్వాలనీ, విదేశీ సంస్థల అప్పులను కేంద్రమే తిరిగి చెల్లించాలనీ హక్కులా గట్టిగా అడగడానికి రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇతరేతర కారణాలుంటే కనీసం విన్నపమయినా చేయాలి. తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో నాడు ఎన్‌టి రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ వారసత్వం ఇదా! అని జనం ముక్కున వేలేసుకుంటున్న పరిస్థితి.

పరస్పర పొగడ్తలు

సభా వేదికపై ప్రధాని, ముఖ్యమంత్రి పరస్పర పొగడ్తలు ఆశ్చర్యం కలిగించాయి. 'టెక్నాలజీ అంటేనే మోడీ' అని ముఖ్యమంత్రి చెబితే 'నేను గుజరాత్ సిఎం అయిన కొత్తలో హైదరాబాద్‌లో చంద్రబాబు చేసిన పనులను పరిశీలించేవాడిని. టెక్నాలజీ విషయంలో చంద్రబాబు నుండి చాలా నేర్చుకున్నాను' అని ప్రధాని అన్నారు. వీరిద్దరిలో ఎవరు ఎవరినుండి నేర్చుకున్నారో అర్థం కాక జనం జుట్టు పీక్కోవాల్సిన పరిస్థితి. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖామాత్యులు ప్రధానిని ప్రస్తుతించిన తీరు రాజుల కాలంలోని వందిమాగధుల్ని తలపింపజేసింది. మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో గొప్ప శక్తిగా ఆవిర్భవిస్తోందని సిఎం చెప్పారు. ఆకలి సూచిలో, మానవాభివృద్ధి సూచికల్లో, ప్రజాస్వామ్యానికి కొలబద్దగా భావించే పత్రికా స్వేచ్ఛ సూచీల్లో మోడీ హయాంలో భారత్ ఏడాదికేడాది దిగజారుతున్న వాస్తవం 'విజనరీ' ముఖ్యమంత్రి గారికి తెలియదనుకోగలమా! అయినా, ప్రధానిని పొగడాలనుకున్నారు కనుక అలా అన్నారు అని ఎవరయినా సరిపెట్టుకోవచ్చు. ఇక ఉప ముఖ్యమంత్రి ఏకంగా భారతదేశమే ఇల్లుగా భావిస్తున్న మోడీ ఆంధ్రప్రదేశ్‌కు ఇల్లులాంటి రాజధాని అమరావతిని అందిస్తున్నారని పేర్కొన్నారు.

మరి రెండేళ్లుగా రగిలిపోతున్న మణిపూర్ సందర్శనకు వెళ్లని ప్రధాని ఆ రాష్ట్రం ఈ దేశంలో లేదని భావిస్తున్నట్టా? ఆ రాష్ట్ర ప్రజలు ఈ ఇంటివారు కాదా? నరేంద్ర మోడీ అనే మిస్సైల్ వుండగా వందల పాకిస్తాన్‌లు కూడా ఏమీ చేయలేవంటూ రెచ్చగొట్టే మాటల్లో తాను కూడా ఉప ముఖ్యమంత్రికి తీసిపోనన్న రీతిలో విద్యా శాఖామాత్యులు వ్యవహరించారు.

ప్రపంచ పటంలో అమరావతి

అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా భారత దేశ పటంలోనే కేంద్రం అధికారికంగా పేర్కొనలేదు. కాని, అమరావతిని ప్రపంచ పటంలో నిలబెడతామని ముఖ్యమంత్రి గొప్పగా చెప్పారు. అంతేగాక అమరావతికి పార్లమెంటులో చట్టం చేయిస్తామని ఆయన వివిధ సభల్లో చెబుతున్నారేతప్ప ఆ పని చేయవలసిన ప్రధాని ఈ సభలో ఆ ఊసే ఎత్తలేదు. అంటే అది జరుగుతుందా లేదా అన్నదీ సందిగ్ధమే! ఈ ఆయిదేళ్లు పూర్తయ్యాక మూడు రాజధానులని లేదా 30 రాజధానులనీ ఎవరైనా అంటే అప్పటి మాటేమిటి? కనుక రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడం తప్పనిసరి కర్తవ్యం. వారి సంగతి అలా ఉంటే మునిసిపల్ మంత్రి నారాయణ 'ప్రపంచంలోనే టాప్ ఐదు రాజధానుల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని' చెప్పడం వెనకటికెవరో 'మా ఊరి మిరియాలు తాటి కాయలంత' అన్న చందంగా ఉంది. ప్రపంచంలో టాప్ సంగతి అటుంచి ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నయ్ వంటి భారత మహా నగరాల సరసన అమరావతి చేరగలదా? అంతెందుకు మన ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లేదా పొరుగునవున్న బెంగళూరు స్థాయికి చేరడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందో కదా! అమాత్యులు అంత హైప్ సృష్టించడం అవసరమా?

కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్వహించిన ఈ భారీ కార్యక్రమంలో రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల్లో కనీసం ఒక్క రూపాయి అయినా కేంద్రం నుండి గ్రాంటుగా ఇస్తామని ప్రధాని ప్రకటించలేదు. కీలకమైన చట్టబద్ధత ప్రస్తావన లేదు. మరి, ఇంత హడావుడి రాష్ట్రానికి ఎంత ప్రయోజనం చేకూరుస్తుందో కాలమే నిర్ణయించాలి.

స్పెర్రీ కంపెనీ బాయిలర్‌లో పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - సత్యవేడు (తిరుపతి జిల్లా)

స్పెర్రీ కంపెనీ బాయిలర్‌లో ప్రమాదవశాత్తు పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొద్ది రోజుల క్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బేక్‌పెట్ జిల్లాకు చెందిన ఫారన్ (22) సత్యవేడు మండలం పాలగుంట గ్రామంలోని స్పెర్రీ కంపెనీలో వెల్డింగ్ పని నిమిత్తం వచ్చారు. అత్యవసర పని నిమిత్తం కాలుతున్న బాయిలర్ పైకి ఎక్కి వెల్డింగ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు కాలు జారి బాయిలర్‌లో పడడంతో కాలి మృతి చెందారు. ఎస్ఐ రామస్వామి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కంపెనీలో సరైన భద్రత నియమాలు పాటించకపోవడమే కార్మికుడి మృతికి కారణమని తోటి కార్మికులు తెలిపారు.

వైసిపి పాలనలో రైతుల బకాయిలు రూ.1,674 కోట్లు

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో రైతులకు చెల్లించాల్సిన రూ.1,674 కోట్ల బకాయిలను తమ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతగా చెల్లించిందని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 5.65 లక్షల మంది రైతుల నుంచి 35.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లోనే రూ.8,277.59 కోట్లు వారి ఖాతాల్లో జమచేసినట్లు మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. ఈ రబీ సీజన్‌లో 1,16,627 మంది రైతుల నుంచి 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లో రూ.2,722.81 కోట్లు జమ చేశామన్నారు.

5 నుంచి 'ఫోరెన్సిక్' వర్కుషాప్

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి ఫోరెన్సిక్ వర్కుషాప్ (ఎపిఎఫ్ఎస్–ఎల్)ను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. వర్కుషాప్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల విచారణాధికారులకు, డాక్టర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఫోరెన్సిక్ ఆధారాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ వర్కుషాప్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ భౌతిక ఆధారాలను శాస్త్రీయంగా వెలికితీయడంలో కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. సిఎం చంద్రబాబు మానసపుత్రిక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (ఎపిఎఫ్ఎస్ఎల్) నిర్మాణాలు ముగింపు దశకు చేరుకున్నాయని, 2026 మార్చి నాటికల్లా ఇవి అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. తుళ్లూరులో రూ.250 కోట్ల వ్యయంతో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఎపి ఫోరెన్సిక్ విభాగం డైరెక్టర్ జి పాలరాజు ఆధ్వర్యాన ఈ వర్కుషాప్ జరగనుందని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు దైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అదానీ పవర్ ప్లాంట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా వేపాడ మండలం మారిక గ్రామాల పరిధిలో అదానీకి చెందిన ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు విషయమై ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. పవర్ ప్రాజెక్టు పేరిట గిరిజనుల జీవితాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పవర్ ప్రాజెక్టు కోసం వారం రోజుల క్రితం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దీనిపై అక్కడి గిరిజనులు ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ సహా పలు సంఘాల నాయకులతో కలిసి గిరిశిఖరాన గల మారిక గిరిజన గూడేలను లోకనాథం శనివారం సందర్శించారు. ఆ ప్రాంతంలోని సాగవుతున్న పంటలనూ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఈ ప్రాంతాన్ని షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని సిపిఎం ఎప్పటి నుంచో పోరాడుతోందన్నారు. ఇక్కడ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే స్థానిక గిరిజనుల బతుకులు ఛిద్రం కావడంతోపాటు శారదానది, రైవాడ ప్రాజెక్టుపై ఆధారపడిన అనకాపల్లి జిల్లాలో సుమారు 2500 ఎకరాల సాగు భూమికి సాగునీరు అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైవాడ నీరు మళ్లించడం వల్ల విశాఖ వాసులకు తాగునీరు కూడా తగ్గే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంతంలో పీసా చట్టం వర్తించకపోయినప్పటికీ ఇక్కడి గిరిజనులంతా స్వచ్ఛమైన పిటిజిలు, కొండదొరలు ఉన్నారని, వీరికి అడవి తల్లితో విడదీయలేని సంబంధం ఉందన్నారు. వీరిని ఇతర ప్రాంతానికి వెల్లగొట్టడం అంటే వారి జీవితానాలను నాశనం చేయడమేనని అన్నారు. మాచ్‌ఖండ్ జలాశయం నిర్వాసితులను నాటి ప్రభుత్వం నమ్మించి మోసం చేయడం వల్ల చెల్లా చెదురైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లాలోని అరకు, అనంతగిరి, జికెవీధి, జెర్రిల ప్రాంతంలో తలపెట్టిన బాక్సైట్ తవ్వకాలను గిరిజనులంతా సమిష్టిగా అడ్డుకోవడంతో ప్రభుత్వం తోకముడవక తప్పలేదని గుర్తు చేశారు. వీరి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని అదాని పవర్ ప్లాంట్ నోటిఫికేషన్‌ను తిప్పికొట్టాలన్నారు. తమ్మినేని మాట్లాడుతూ.. ఎర్రజెండా గిరిజనులకు అండగా నిలబడుతుందని, ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు అడుగులేస్తే తగిన గుణపాఠం నేర్చుకోవాల్సివస్తుందని హెచ్చరించారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వెంకన్న మాట్లాడుతూ అటవీప్రాంతాన్ని అదానికి దోచిపెట్టేందుకు ప్రభుత్వం కుయుక్తులు చేస్తోందని, గిరిజన యువత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

గ్రామ సర్పంచ్ పి.పెంటమ్మ మాట్లాడుతూ పవర్ ప్లాంట్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా గ్రామ సభలో తీర్మాణం చేస్తామని చెప్పారు. స్థానిక సిపిఎం నాయకులు చల్లా జగన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కెవిపిఎస్ నాయకులు రాకోటి ఆనంద్ తదితరులు మాట్లాడారు. అంతకుముందు విల్లంబులు ఎక్కుపెట్టి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



వేదికపై విల్లంబులు చేబట్టిన గిరిజనులు, ఇతర నాయకులు

'పున:ప్రారంభం' విజయవంతం

- సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పనుల పున:ప్రారంభ కార్యక్రమం విజయవంతమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పున: ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు' అని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియా, సోషల్ మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో, కేంద్ర మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తామని వెల్లడించారు.

అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు అని పేర్కొన్నారు.

నూతన అధ్యాయం : ప్రధాని నరేంద్రమోడీ

అమరావతి పనుల పున:ప్రారంభంతో రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. భవిష్యత్ పట్టణ కేంద్రంగా అమరావతి ఆవిర్భవిస్తుందని, రాష్ట్ర అభివృద్ధి పథాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు.

అక్రమంగా తరలుతున్న ధాన్యం

- మిర్యాలగూడ చెక్‌పోస్టు వద్ద 2,200 బస్తాల ధాన్యం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎపి నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న 2,200 బస్తాల ధాన్యాన్ని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ చెక్‌పోస్టు వద్ద పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఆరు లారీలు, డిసిఎం వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి రాజశేఖర్‌రాజు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నందున దళారులు మధ్యవర్తుల ద్వారా ఎపి నుంచి లారీల్లో ధాన్యాన్ని తీసుకొస్తున్నారని తెలిపారు. అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో మిర్యాలగూడ డివిజన్‌లోని వాడపల్లి నాగార్జునసాగర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికీ ఆంధ్రా నుంచి వచ్చిన వంద నుంచి 150 లారీల వరకు ధాన్యాన్ని వెనక్కి పంపించామని, అయినప్పటికీ అక్రమ మార్గాన ధాన్యాన్ని తరలిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే మిర్యాలగూడ చెక్‌పోస్ట్ వద్ద ఆరు లారీలు, డిసిఎంలో తరలిస్తున్న సుమారు 2,200 బస్తాల ధాన్యాన్ని పట్టుకున్నట్టు చెప్పారు. ఈ ధాన్యాన్ని తరలించే దళారులు, మధ్యవర్తులపై కేసులు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఎవరైనా ధాన్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండో రోజూ బంద్ జయప్రదం

- ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం ఏజెన్సీలో ఎక్కడికక్కడ నిరసనలు
- స్తంభించిన పాడేరు మన్యం
- చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించడంతో తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

ఏజెన్సీలో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ప్రకటించాలని తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ రెండో రోజైన శనివారమూ అల్లూరి జిల్లాలో విజయవంతమైంది. రవాణా వ్యవస్థ పాడేరు మన్యంలో స్తంభించింది. ప్రభుత్వ, ప్రయివేటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. బంద్ తీవ్రత ఆదివాసీ ప్రాంతమంతటా సాగుతుండడంతో ప్రభుత్వం తీరులో కాసింత మార్పు కనిపించింది. సోమవారం రాష్ట్ర స్థాయిలో చర్చలకు ఆదివాసీ నాయకులను, డిఎస్‌సి సాధన కమిటీ నేతలను ఆహ్వానించడంతో బంద్‌కు ఆందోళనారులు తాత్కాలిక విరామం ప్రకటించారు. రెండో రోజు బంద్‌లో భాగంగా పాడేరు పట్టణంలోని సెయింటెన్స్ కాన్వెంట్ జంక్షన్ వద్ద, ఐటిడిఎ వద్ద నాయకులు బైఠాయించారు. రాకపోకలను నిలిపివేశారు. బంద్ ప్రభావం స్థానిక మార్కెట్‌పై పడింది. పలు మండలాల్లో బంద్ నిర్వాహకులు రోడ్లపైనే వంటావార్పు కార్యక్రమాలతో నిరసన వ్యక్తం చేశారు. స్పెషల్ డిఎస్‌సి ప్రకటించే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టీకరణ చేశారు. పాడేరులో అరుకు ఎంపి తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే ఎం విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యేలు కె భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ బంద్‌కు మద్దతు తెలిపారు.

అల్లూరి కలెక్టర్‌ను అడ్డగింత

పాడేరులోని తన నివాసం నుంచి కార్యాలయానికి బయలుదేరి వెళ్తున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను తలారిసింగి సమీపంలో ఆందోళనకారులు అడ్డుకున్నారు. ప్రభుత్వం నుంచి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నుంచి వచ్చిన ఆదేశాలతో డిఎస్‌సి సాధన కమిటీ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. చర్చలకు రావాలని తన కార్యాలయానికి ఆహ్వానించారు. అక్కడకు వెళ్లిన నాయకులు రాష్ట్రంలోని అన్ని ఐటిడిఎల పరిధిలో ఉన్న ఉపాధ్యాయ పోస్టులను మెగా డిఎస్‌సి నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని పట్టుబట్టారు. జిఓ నెంబర్ 3 రద్దు తరువాత ఆదివాసీలు ఎలా నష్టపోయిందీ డిఎస్‌సి సాధన కమిటీ నాయకులు అప్పలనర్స, మాణిక్యం వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పెషల్ డిఎస్‌సి అంశంపై లీగల్ ఒపీనియన్ తీసుకొని ముఖ్యమంత్రితో చర్చలు నిర్వహించి, పరిష్కార చర్యలు తీసుకోనున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తనకు తెలిపారని చెప్పారు. మంత్రి సోమవారం ఆదివాసీ సంఘాలు, స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ, ప్రజా సంఘాలతో రాష్ట్ర స్థాయిలో చర్చలు జరుపనున్నట్టు వెల్లడించారు. దీంతో బంద్‌ను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు నాయకులు ప్రకటించారు. అనంతరం తలారిసింగి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు

చంద్రబాబు హామీని నిలబెట్టుకోవాలి : కిల్లో సురేంద్ర

ఆదివాసీలకు ఏజెన్సీలో శతశాతం ఉద్యోగ రిజర్వేషన్‌ను అమలు చేస్తామని గత ఎన్నికల సమయంలో ప్రకటించిన సిఎం చంద్రబాబు నాయుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. అరకులోయలో చేపట్టిన బంద్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇక్కడ బంద్‌తో పద్మావతి గార్డెన్, గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియం, దుకాణాలు మూతబడ్డాయి. వాహనాలు నిలిచిపోవడంతో పర్యాటక ప్రాంతమైన అరకు అంతా నిర్మానుష్యంగా కనిపించింది. బంద్‌లో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొన్నారు. హుకుంపేట, ముంచంగిపుట్టు, అనంతగిరి, డుంబ్రిగుడ, పెదబయలు సహా అన్ని మండలాల్లో బంద్ జయప్రదమైంది.



అల్లూరి జిల్లా పాడేరులో కలెక్టర్ వాహనాన్ని అడ్డగించిన ఆందోళనకారులు

ఎల్‌టిపిల్లో సెల్ఫ్ సర్టిఫికేషన్ గుబులు

- బిఎన్ఎస్ కింద క్రిమినల్ కేసు, లైసెన్సు రద్దు
- రెండేళ్ల తరువాత డీవియేషన్ జరిగినా వారే బాధ్యులు
- ప్రభుత్వ ఉత్తర్వులతో ఆందోళనలో సర్వేయర్లు, ఇంజనీర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రణాళికా విభాగాల్లో అనుమతులు సరళతరం చేసే పేరుతో సర్వేయర్లను, ఇంజనీర్లను బాధ్యులను చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు ప్రణాళికా విభాగాన్ని తీవ్ర గందరగోళంలో పడేశాయి. ఉత్తర్వుల్లో పూర్తి బాధ్యతంతా లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు(ఎల్‌టిపి) మీదకు నెట్టేశాయి. దీంతో ప్రణాళికా విభాగం కర్రపెత్తనం తప్ప క్షేత్రస్థాయి పరిశీలన దాదాపు ఉండని పరిస్థితి ఏర్పడింది. స్క్రూటినీ చేయాల్సి ఉన్నా అది కూడా చేయలేనిస్థితిలోకి సిబ్బంది వెళ్లారు. అన్నిటికీ సర్వేయర్లు, ఇంజనీర్లపై ఒత్తిడి తెచ్చి వారినే బాధ్యులను చేయడంతోపాటు వారిపై బిఎన్ఎస్ చట్టం కింద క్రిమినల్ కేసులు పెడతామని, వారి లైసెన్సు రద్దు చేస్తామనీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై టెక్నికల్ పర్సన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ పేరుతో వారి వద్ద డాక్యుమెంట్లు తీసుకుంటున్న ప్లానింగు విభాగాలు పూర్తిగా వారినే బాధ్యులను చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఒకవేళ ప్లానింగులో తప్పులుంటే స్క్రూటినీ సమయంలోనే వాటిని ఆపొచ్చని, అలా చేయకుండా రెండేళ్ల తరువాత కూడా బాధ్యులను చేయడం ఏమిటని సర్వేయర్ల అసోసియేషన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సెల్ఫ్ సర్టిఫికేషన్, ప్లానింగుకు అనుమతులకు సంబంధించి ప్రభుత్వం ఫిబ్రవరి నాలుగోతేదీన జిఓ ఎంఎస్ నెంబరు 20 జారీ చేసింది. 358 చదరపు గజాల్లో ప్లానింగుకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే సర్వేయర్లు, ఇంజనీర్లు సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. యజమాని కూడా ఎటువంటి అతిక్రమణ ఉండదని మరో సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం వాటిని స్క్రూటినీ చేసి అనుమతులిచ్చే బాధ్యత బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఆపై స్థాయి అధికారికి అప్పగించారు. ఈ క్రమంలో ప్రతిరోజూ వారికి వచ్చే దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఒకటో రెండో చూసి మిగిలినవి ఆపేస్తున్నారు. లేదా ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ఆధారంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. నిర్మాణం మొదలుపెట్టిన తరువాత పిల్లర్లు, బేస్‌మెంట్, లింటల్స్, శ్లాబు ఇలా దశలవారీగా అన్నిటినీ ఎప్పటికప్పుడు సర్వేయర్లు, ఇంజనీర్లు ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. నిర్మాణం పూర్తితో ఎల్‌టిపిల బాధ్యత తీరుతుంది. అయితే యజమానులు చాలా వరకూ వాస్తు పేరుతోనో, ఇంకో కారణంతోనే ఎక్కడో కొంత అతిక్రమణ చేస్తారు. దీన్ని కూడా నిరంతరం పరిశీలించాల్సిన బాధ్యత ఎల్‌టిపిలదే. రెండేళ్ల అనంతరం నిర్మాణంలో ఎక్కడన్నా అతిక్రమణ ఉన్నా ఎల్‌టిపిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిఓల్లో పేర్కొన్నారు. అయితే తాము చేసిన దరఖాస్తును పరిశీలించి స్క్రూటినీ చేసి అనుమతులివ్వాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను మాత్రం ఇందులో బాధ్యులను చేయడం లేదు. దీనిపై ఎల్‌టిపిలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యజమాని వల్ల జరిగిన అతిక్రమణకు కూడా తామే బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల దీనిపై మంత్రి నారాయణ, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్లను కలిసి వారి అభ్యర్థలను వివరించారు. 300 చదరపు గజాలలోపు స్థలాలకు సంబంధించిన భవన నిర్మాణ అనుమతుల విషయంలో ప్లింత్ లెవల ఇన్‌స్పెక్షన్ రిపోర్టు బాధ్యతల నుండి లైసెన్స్‌డ్ సర్వేయర్లను తొలగించి ఆ బాధ్యతలను టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించాలని కోరారు. సెట్‌బ్యాక్స్ రిలాక్సేషన్ ఇవ్వాలని తెలిపారు. భవన నిర్మాణాల్లో అతిక్రమణలు లేకుండా ప్లానింగు సెక్రటరీలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కొన్ని సందర్భాల్లో యజమానులు కోర్టుల్లో ఉన్న న్యాయపరమైన వివాదాలు చెప్పడని, దీనికి కూడా సర్వేయర్లను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ లైసెన్స్‌డ్ పర్సనల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాంబాబు మాట్లాడుతూ తాము ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరిస్తామని, అన్నిటికీ తమనే బాధ్యులను చేసే నిబంధనలు మార్చాలని విజ్ఞప్తి చేశారు.

రాణా గొంతు, చేతి రాత నమూనాల సేకరణ

న్యూఢిల్లీ : 2008 ముంబయి ఉగ్రదాడులకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న తహవ్వూర్ రాణా వాయిస్, హ్యాండ్ రైటింగ్ నమూనాలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) శనివారం సేకరించింది. ఢిల్లీ కోర్టులో ఇన్–ఛాంబర్ విచారణలో ఎన్ఐఎ అధికారులు వీటిని సేకరించారు. శనివారం భారీ భద్రత మధ్య జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టుకు రాణాను ఎన్ఐఎ అధికారులు తీసుకొచ్చారు. జడ్జి వైభవ్ కుమార్ ముందు రాణా వివిధ పదాలు, అంకెలు రాసాడు. కోర్టు రాణాకు గతవారంలో 12 రోజుల కస్టడీ విధించిన సంగతి తెలిసిందే. ముంబయి దాడుల ఘటన జరిగిన 17 ఏళ్ల తరువాత రాణాను అమెరికా భారత్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే.

గోవా ఆలయంలో తొక్కిసలాట

మొదటిపేజి తరువాయి

అవసరమైన సాయమందిస్తామని హామీ ఇచ్చారు. తొక్కిసలాటపై సమగ్ర విచారణ చేపడతామని చెప్పారు. దీనిపై నివేదికను వెల్లడిస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల సంతాపం

తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు మరణించడం పట్ల సంతాపం తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ఈ మేరకు ఆమె ఎ క్స్‌లో పోస్టు పెట్టారు. ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి కార్యాలయం ఈ పరిస్థితులను పర్యవేక్షిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. తొక్కిసలాటలో యాత్రికులు మరణించడం బాధాకరమని పేర్కొన్నారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు, ఉక్కు కార్మికులు

'ఉక్కు' కార్మికులపై కక్ష సాధింపు చర్యలు తగవు

- స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు కార్మికులపై కేంద్ర ప్రభుత్వం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు జె.సింహాచలం అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1542వ రోజుకు చేరాయి. దీక్షల్లో యూనియన్ నాయకులు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పుడు ఇస్తున్న వేతనాలను కూడా అరకొరగా చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం శోచనీయమని తెలిపారు. కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉందని ప్రభుత్వం చెప్పడం, దానిని ప్రయివేటు కంపెనీలతో పోల్చడం ఎంతమాత్రమూ తగదన్నారు. అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఉక్కు కార్మికులకు పని ప్రదేశంలో భద్రత కరువైందని తెలిపారు. వారి సౌకర్యాలకు కోత పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన కార్మిక సంఘాల ప్రతినిధులపై క్రమశిక్షణా చర్యల పేరిట కక్ష సాధింపునకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని తెలిపారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘం సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం చేస్తోన్న కుట్రలను వివరించారు. దీక్షల్లో నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు, దేవుడునాయుడు, పట్టా రమేష్, అప్పలరాజు పాల్గొన్నారు.

మరింత నమ్మకాన్ని నింపిన ప్రధాని వ్యాఖ్యలు

- ప్రజలందరి భాగస్వామ్యంతోనే సభ విజయవంతం
- కూటమి ప్రజా ప్రతినిధులతో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రగతికి మద్దతుగా నిలుస్తామన్న ప్రధాన మంత్రి వ్యాఖ్యలు మరింత నమ్మకాన్ని నింపాయని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాజధాని అమరావతి పనుల పున:ప్రారంభ సభ కార్యక్రమంపై కూటమి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే సభ విజయవంతమైందని చెప్పారు. అమరావతి ఆవశ్యకతను వివరించేందుకే ప్రధాని చేతుల మీదుగా పనులు పున:ప్రారంభించామని వివరించారు. అమరావతి నగరం కాదు, ఒక శక్తిగా మారుతుందన్న ప్రధాని మాటలు స్ఫూర్తిని నింపాయని తెలిపారు. రాష్ట్ర వృద్ధి రేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందని ఆయన చేసిన వ్యాఖ్యలు భవిష్యత్ రాజధానిని ఆవిష్కరించాయని చెప్పారు. మోడీ ప్రసంగం ప్రజల పట్ల ఉన్న అభిమానానికి, రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచిందని తెలిపారు.

మంత్రులు, నేతలకు అప్పగించిన పనులను బాధ్యతగా వ్యవహరించి బ్రహ్మాండంగా పని చేశారని అభినందించారు. లక్షల మంది ప్రజలు పోటెత్తినా ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాల ప్రజల భాగస్వామ్యంతో ఉత్సాహంగా కార్యక్రమం జరిగిందన్నారు. సభ నిర్వహణకు సమస్త ప్రభుత్వ యాంత్రాంగం సమర్ధవంతంగా పనిచేసిందని వివరించారు. ఈ కార్యక్రమంపై అన్ని వర్గాల ప్రజల్లో సానుకూలత వ్యక్తమైందని మంత్రులు పార్థసారధి, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, పి నారాయణ తమ అభిప్రాయాలు చెప్పారు. మూడేళ్లలో నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభోత్సవాలు కూడా జరపాలని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. అంతా మీ చేతుల్లోనే ఉందంటూ మంత్రి నారాయణతో చెప్పగా.. లక్ష్యం మేరకు పనులు పూర్తిచేస్తామని నారాయణ బదులిచ్చారు.

అమరావతి అంతులేని కథ

- మోడీ పర్యటన వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదు
- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం ఒక అంతులేని కథగా మిగిలిపోతుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రధాని మోడీ రెండోసారి అమరావతి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతికి మోడీ హామీ ఏమీ ఇవ్వలేదని, కేంద్రం నుంచి రూపాయి కూడా గ్రాంటుగా తెప్పించలేకపోయారని వివరించారు. మోడీ పర్యటన వల్ల రాజధాని రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు ఈ విషయాన్ని మోడీ వద్ద ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. చంద్రబాబు విధానాల వల్ల రాజధాని రైతులకు నష్టం జరుగుతోందని, ఈ అంశం త్వరలోనే వారికి అర్థమవుతుందని చెప్పారు. 34 వేల ఎకరాలను భూ సమీకరణలో తీసుకుని అభివృద్ధి చేసి ఇస్తామన్న రిటర్నబుల్ ప్లాట్లు ఇంత వరకు ఇవ్వలేదని, మరో 44 వేల ఎకరాలు భూ సమీకరణలో తీసుకుంటామని ప్రకటించడంతో అమరావతి రైతులకు నిద్ర పట్టడం లేదన్నారు. ఆశించిన ధరలు రాకపోగా గణనీయంగా పడిపోతున్నాయనే ఆందోళన రైతుల్లో ఉందని తెలిపారు. రైతుల భూమి అభివృద్ధికి, రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టలేక తాము వికేంద్రీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చామన్నారు. ఈ విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టుకు కూడా తెలిపామన్నారు. రాజధాని స్వయం సమృద్ధి ప్రాజెక్టు అని, 10 వేల ఎకరాలు అమ్మి నిర్మాణం చేయాలని వైసిపి ప్రభుత్వానికి సలహా ఇచ్చిన చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చిన మాట మార్చి 44 వేల ఎకరాలను ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అంతేగాక రూ.50 వేల కోట్లు అప్పుచేసి అంచనాలను భారీగా పెంచి నిర్మాణాల పేరుతో దోపిడికి పన్నాగం వేశారని ఆరోపించారు.

మరో కొండకు టెండర్

మొదటిపేజి తరువాయి

అధికారిక బృందం ఇచ్చాపురం కొండకు విచ్చేసింది.

ఎమ్మెల్యే గంటా మద్దతు!

రాష్ట్రంలో నెల్లూరు జిల్లాకు చెందిన టిడిపి సీనియర్ నాయకునికి సంబంధించిన వ్యక్తి ఈ కొండకు టెండరు వేశారు. స్థానిక (భీమిలి) ఎమ్మెల్యే గంటా ఆయనకు బంధువు కావడంతో గంటా, పిఆర్‌పి.నాయుడు, ఇంకొంతమంది ఇటీవల వచ్చి దెయ్యాలమెట్ట కొండను పరిశీలించి వెళ్లారు. దీనిని బట్టి ఇక్కడ మైనింగ్‌కు గంటా మద్దతు ఉన్నట్లు స్పష్టమవుతోందని ఈ ప్రాంతంలో చర్చ జరుగుతోంది. గిరిజనుల ప్రయోజనాలను కాదని మైనింగ్ టెండర్‌దారులకు అండగా నిలవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుకుంటామంటున్న గిరిజనం

'కొండలపై పోడు ఒకపక్క, కొండల కింద ఉపాధి పనులు, జీడి మామిడి పంటలతో మరోపక్క ఉపాధి పొందుతున్న మా పొట్ట కొట్టాలని ప్రభుత్వ పెద్దలు ఎందుకు చూస్తున్నారు' అని గిరిజన మహిళ కొప్పుల పైడమ్మ, బొప్పన యువరాజ్ ప్రశ్నిస్తున్నారు. తమ గ్రామానికి రోడ్డు లేదని, గ్రామంలో లైట్లు వెలగవని, కానీ తమ సంపదల మీద మాత్రం పెద్దోళ్ల కళ్లు పడ్డాయని పేర్కొంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. 'మా కష్టం మాదే.. మా బతుకును, ఉపాధిని దెబ్బతీస్తే ఊరుకునేది లేదు. కొండపై చెయ్యి పడితే సహించేది లేదు. అంటూ ప్రభుత్వాన్ని ఇక్కడి గిరిజనులు హెచ్చరిస్తున్నారు.

తవ్వకాల అనుమతులు రద్దు చేయాలి : సిపిఎం

దెయ్యాలమెట్టపై క్వార్ట్‌జైట్ మైనింగ్ తవ్వకాల అనుమతులను రద్దు ,చేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇచ్చాపురం గ్రామంలో అడ్డగోలు, అక్రమ మైనింగ్ విషయం తెలిసి అక్కడ పర్యటించారు. సిపిఎం అండగా ఉంటుందని గిరిజనానికి భరోసా కల్పించారు. కొండకోనల్లో నివసించే గిరిజన హక్కులను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు. అడ్డగోలుగా భూములు కొట్టేయడం దారుణమన్నారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు నాగరాణి ఉన్నారు.



పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం జుత్తిగలోని రైతుసేవా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు


తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పసలపూడిలో రైతు సేవా కేంద్రానికి తాళం వేసి అడ్డంగా కూర్చున్న రైతులు

అన్నదాతల ఆగ్రహం

ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్

తూర్పు, పశ్చిమగోదావరిలో రైతు సేవా కేంద్రానికి తాళాలు

ఏలూరులో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం

ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం నిలిపేయడంతో రైతులు, కౌలు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో శనివారం రైతు సేవా కేంద్రాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఏలూరులో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పసలపూడిలో రైతు సేవా కేంద్రానికి రైతులు తాళం వేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పిఎస్‌డి.ప్రసాద్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు లక్ష్యం పూర్తయ్యిందని కొనుగోళ్లను నిలిపివేయడం ఎంతవరకూ సబబు అని రైతులు ప్రశ్నించారు. దళారులకు అమ్ముకుంటే 75 కేజీల బస్తాకు రూ.250 వరకూ నష్టపోతున్నామని తెలిపారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఆర్‌ఎస్‌కెల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులకు ఇబ్బంది కలిగిన మాట వాస్తమేనన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి, సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు తక్షణ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో, రైతులు ఆందోళన విరమించారు.

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం జుత్తిగ గ్రామంలోని రైతుసేవా కేంద్రానికి ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులు తాళం వేశారు. ధాన్యం మాసూలు చేసి రోజులు గడుస్తున్నా రైతుసేవా కేంద్రంలో గోనెసంచులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోనె సంచులు వెంటనే ఇవ్వాలని, ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల ఆందోళనతో తహశీల్దార్ వై.రవికుమార్, మండల వ్యవసాయాధికారి ఎ.జ్యోషిల అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ రైతులు ధాన్యం మాసూలు చేసి రోజుల తరబడి సంచుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు.

రైతుసేవా కేంద్రంలో సిబ్బంది సరైన సమాధానం చెప్పడం లేదని తెలిపారు. పిఆర్ 126 రకం బయట అమ్ముకోండని చెప్పడం దారుణమన్నారు. గోనె సంచులు వెంటనే ఇవ్వాలని, ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలని, మిల్లర్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయ్యిందని, రబీ ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడం దారుణమన్నారు. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం టార్గెట్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని తెలిపారు. కొన్నిచోట్ల లారీలు, ట్రాక్టర్లలోకి లోడ్ చేసిన ధాన్యం మూడు రోజులుగా రైతుసేవా కేంద్రాల వద్ద ఉండిపోయాయని తెలిపారు. ఏలూరులోని వెంకటాపురం రైతుసేవా కేంద్రం వద్ద ట్రాక్టర్‌కు కిరాయి పెరిగిపోతుండడంతో కౌలు రైతు బైరెడ్డి లక్ష్మణరావు ఆందోళన వ్యకం చేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం వెంటనే పెంచి రైతులు, కౌలురైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు.

తల్లిదండ్రుల వద్దకు చేరిన ఐశ్వర్య

● మూడు రోజుల తర్వాత వీడిన చిన్నారి అదృశ్యం మిస్టరీ

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)



ఐశ్వర్యను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డి నగర్‌లో అదృశ్యమైన మూడేళ్ల చిన్నారి ఐశ్వర్య ఎట్టకేలకు తల్లిదండ్రుల వద్దకు చేరింది. పోలీసులు, బాలిక తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు... బాలిరెడ్డినగర్‌కు చెందిన చిలకూరి హరికృష్ణ కుమార్తె ఐశ్వర్య ఈ నెల ఒకటిన అదృశ్యం అయ్యింది. చిన్నారి తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్‌పి రాయపాటి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శింగరాయకొండ సిఐ సిహెచ్ హాజరత్తయ్య, ఎస్‌ఐ బి.మహేంద్ర, పోలీసు సిబ్బందితో మూడు బృందాలు ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. శింగరాయకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిసి కెమెరాల ఫుటేజీని పరిశీలించి ఐశ్వర్యను ఎవరు తీసుకెళ్లారో, ఎటు వైపు తీసుకెళ్లారనే విషయాలను గుర్తించారు. పాప ఫొటోను అన్ని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. కరపత్రాలు పంచారు. సోషల్ మీడియాలో పాప ఫొటోను గుర్తించిన నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండల పరిధిలోని అంగభూపాలపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాప తమ గ్రామంలో ఉన్నట్లుగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అంగభూపాలపురం వెళ్లి పాపను తీసుకొచ్చి ఎస్‌పి దామోదర్ సంక్షమంలో తల్లిదండ్రులకు అప్పగించారు. పాపను తీసుకెళ్లిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. చిన్నారి ఆచూకీ కనిపెట్టడంలో ప్రతిభ కనపరిచిన వారిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లకు కేరాఫ్ అమరావతి

● సమాచారశాఖ మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాబోయే కాలంలో ఎఐ, ఐటి, క్వాంటమ్ కంప్యూటింగ్‌లకు కేరాఫ్ అమరావతిగా మారనుందని, ప్రపంచంలో అమరావతి నెంబర్‌వన్ సిటీగా అవతరించనుందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని ఆయన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. అమరావతి పున:ప్రారంభోత్సవ సభలో ప్రధాని రూ.58 వేలకోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రధాని, సిఎం, డిప్యూటీ సిఎం తమ అనుభవంతో గాడిలో పెట్టారని ఆయన తెలిపారు.

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

● వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కనీస మద్దతు ధర లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి వారి గోడు పట్టడం లేదని వైసిపి అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన పోస్ట్ చేశారు. కనీస మద్దతు ధరలు లభించక, పెట్టిన పెట్టుబడులు రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, మంత్రుల, యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తి చూడకపోవడం ధర్మమేనా? అని ప్రశ్నించారు. మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, వేరుశనగ, టమోటా, అరటి, చీనీ, పొగాకు ఇలా ఏ పంటలు చూసినా కనీస మద్దతు ధర రావడం లేదని పేర్కొన్నారు. చొరవ చూపి మార్కెట్లో జోక్యం చేసుకోవాలన్న కనీస బాధ్యతను విస్మరించారన్నారు. పైగా డ్రామాలతో రైతులను నిలువునా మోసం చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మిర్చి విషయంలోనూ రైతులను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. కొనుగోలు అంశం కేంద్రం పరిధిలో లేకపోయినా నాఫెడ్ కొనుగోలు చేస్తుందని మొదట నమ్మబలికారని, క్వింటాకు రూ.11,781 కొంటామని చెప్పి ఒక్కపైసా కూడా ఖర్చుపెట్టకుండా రైతుల నుండి కొనుగోలు చేయకుండా వారికి సున్నం రాశారని విమర్శించారు. గత ఐదేళ్లలో రూ.7,796 కోట్లు ఖర్చు చేసి పంటలు కొన్నామని, ధరల స్థిరీకరణ నిధికి రూ.3 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. కొత్తగా ఏమీ చేయలేకపోయినా, వైసిపి ప్రభుత్వ విధానాన్ని కొనసాగించి ఉంటే రైతులకు ఊరట లభించేదని తెలిపారు. ఈ బడ్జెట్లో రూ.300 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. ధాన్యం, కోకో, పొగాకు, ఆక్వా రైతులు ఆయా జిల్లాల్లో ఆందోళనలు చేస్తుంటే ఇప్పటికీ రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధరల విషయంలో మార్కెట్లో జోక్యం చేసుకోవాలని కోరారు. మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు.

రాజధానిలో పేదలు ఉండకూడదా?
- మాజీ ఎమ్మెల్సీ జూపూడి

రాజధానిలో పేదలు ఉండకూడదనే విధంగా సిఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, జగన్ హయాంలో ఇచ్చిన 50 వేల ఇళ్ల పట్టాలను రద్దు చేస్తున్నారని వైసిపి మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏకంగా ఆర్-5 జోన్‌ను తొలగించారని తెలిపారు. వెనుకబడిన తరగతుల పట్ల చంద్రబాబు వివక్ష చూపిస్తున్నారని విమర్శించారు.

వడదెబ్బకు ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం చిలమత్తూరు గ్రామంలో శనివారం వడదెబ్బకు ఉపాధి హామీ కార్మికుడు కేశవులు (65) మృతి చెందారు. తోటి కార్మికులతో కలిసి ఉపాధి పని చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయి ఆయన ప్రాణాలు విడిచారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురికావడమే ఇందుకు కారణమని తోటి కార్మికులు తెలిపారు. వారం రోజుల క్రితం కూడా ఇదే మండలంలో వడదెబ్బకు ఓ ఉపాధి కార్మికుడు మృతి చెందారు.

రేషన్‌కార్డు ఇకెవైసి గడువు జూన్ 30 వరకు పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రేషన్‌కార్డు ఇకెవైసి చేయించుకునే గడువును జూన్ 30 వరకు ప్రభుత్వం పొడిగించింది. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకతను పెంచడంతోపాటు అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే రేషన్ సదుపాయాలు అందించేందుకు ఇకెవైసిని తప్పనిసరి చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో గడువును పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.



షాపు వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మద్యం షాపు తొలగించాలని మహిళల ఆందోళన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం పోతేపల్లి గ్రామంలోని శక్తి వైన్స్ వద్ద మహిళలు శనివారం ఆందోళన నిర్వహించారు. నివాస ప్రదేశాల్లో మద్యం షాపునకు అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మద్యం షాపు ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇప్పటికే శక్తి వైన్ షాపును తొలగించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, హోం శాఖ మంత్రి అనిత, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా వైన్ షాపు యాజమాన్యానికి, స్థానిక మహిళలు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఘర్షణను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై మంత్రి కొల్లు రవీంద్ర సీరియస్‌గా తీసుకొని ఎక్సైజ్ అధికారులతో మాట్లాడారు. దీంతో శక్తి వైన్ షాపును తాత్కాలికంగా మూసివేశారు.

ఊకదంపుడు ఉపన్యాసాలతోనే సరి

● కె.నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అమరావతి పర్యటనకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టుకున్నారని, ఆత్మస్తుతి పరనిందలా సాగిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ దుయ్యబట్టారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం అమరావతి పర్యటనకు విచ్చేసిన నరేంద్ర మోడీ ఉపన్యాసంతో మభ్యపెట్టి మారేడుకాయ చేసేలా వ్యవహరించారని, రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి, స్టీల్ ప్లాంట్ తదితర అంశాలపై ఎలాంటి ప్రకటనా చేయలేదన్నారు. ఆఖరికి పదేళ్ల కిందట వేసిన శంకుస్థాపన రాయి గురించి కూడా గుర్తు చేసుకోలేకపోయారని తెలిపారు. కనీసం రాజధాని శంకుస్థాపనకు మలిసారి వచ్చిన సందర్భంలో స్పష్టమైన గ్రాంట్ ప్రకటించలేదని, కేవలం ఉపన్యాసం ఇచ్చిపోవడానికి మాత్రమే వచ్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజ నాలు, కావలసిన అభివృద్ధి, నిధులు, ప్రత్యేక హోదా అంశాన్ని లేవనెత్తకుండా రాజుకు భటుల వలె సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఇటువైపు ఒకరు, అటు ఒకరు నిల్చుని షో చేశారని అన్నారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నుంచి రూ. 15000 కోట్ల అప్పులో పది శాతం మాత్రమే కేంద్రం బాధ్యత తీసుకోగా మిగిలిన 13500 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వంపైనే భారం పడనుం దని తెలిపారు. ఈ విషయంగా తిరుపతి ఎంపి పార్లమెంటులో లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా పది శాతం మాత్రమే కేంద్రం బాధ్యతగా పేర్కొన్నట్లు స్పష్టంగా ఉందని గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి మురళి పాల్గొన్నారు.

రెమిడియల్ తరగతుల పేరుతో వేధించొద్దు

● పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెమిడియల్ తరగతుల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం సరైంది కాదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి తెలిపారు. ఏప్రిల్ 23న విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 81.14 శాతం ఉత్తీర్ణత చెంది మంచి ఫలితాలు సాధించారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తీర్ణులు కాని 18.86 శాతం పిల్లల కోసం ఇప్పటికే సప్లిమెంటరీ పరీక్షలకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఉత్తీర్ణులు కాని పిల్లల కోసం రెమిడియల్ తరగతుల పేరుతో ఇచ్చిన ఆదేశాలు ఉపాధ్యాయుల వేసవి సెలవులను నిరోధించడమేనని పేర్కొన్నారు. ఇతర ఉద్యోగులలా కాకుండా ఉపాధ్యాయులు వెకేషన్ శాఖలో పనిచేస్తున్నారని తెలిపారు. మండు వేసవిలో ఉపాధ్యాయులను వేధించొద్దని, ఆదేశాలను ఉపసంహరించుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును కోరారు.

నిబంధనలకు వ్యతిరేకంగా ఉత్తర్వులు : ఎపిటిఎఫ్

వేసవి సెలవుల్లో పాఠశాలల్లో ఉపాధ్యాయులు యథాతథంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసిందని ఎపిటిఎఫ్ తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ చిరంజీవి, జి హృదయరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు ఏప్రిల్ 23 నుంచి జూన్ 11 వరకు సెలవులు ప్రకటించినప్పటికీ ఆదివారం, సెలవు రోజుల్లో కూడా యథాతథంగా పనిచేయాలని, మధ్యాహ్న భోజనం, డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ సదుపాయాలు కల్పించాలని ఇచ్చిన మార్గదర్శకాలు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు.

పదో తరగతి విద్యార్థులను ఉత్తీర్ణులు చేసేందుకు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు స్వచ్ఛంధంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

వేసవి తరగతులు మార్చాలి : టిఎన్‌యుఎస్

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత కోసం తరగతులు నిర్వహించాలని ఇచ్చిన ఉత్తర్వులను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు. తరగతులు ఉదయం 8 నుంచి 11.30లోపు ముగించేలా ఉత్తర్వులివ్వాలని కోరారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి చంద్రశేఖర్ తదితరులు

తెలుగు భాషను అభిమానించాలి

● పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతి ఒక్కరూ తెలుగు భాషను అభిమానించాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5 తేదీల్లో గుంటూరులో జరగబోయే ప్రపంచ తెలుగు 3వ మహాసభ పోస్టర్‌ను ఆయన శనివారం గుంటూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక భారతీయ విద్యాభవన్‌లో ఆంధ్ర సరస్వత పరిషత్తు అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ తెలుగు భాషను అమితంగా ప్రేమించే నందమూరి తారకరామారావు పేరుతో ఈ సభను నిర్వహించడం ముదావాహమన్నారు. తెలుగును లోతుగా నేర్చుకొని, అందులోని శబ్దాలను, గాఢతను పూర్తిగా తెలుసుకోగలగాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు, మహాసభల కార్యక్రమ ముఖ్య సమన్వయకర్త పి.రామచంద్రరాజు, వివిఐటి సంస్థల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు.

ముఖం చాటేసిన జగన్ : విష్ణుకుమార్‌రాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి పున:ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానం పంపినా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కాకుండా ముఖం చాటేశారని శాసనసభలో బిజెపి ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎపి రాజధాని అమరావతేనని, తప్పకుండా అన్ని విధాలా భవిష్యత్తులో అభివృద్ధి చెందుతుందని అన్నారు. జగన్, పిసిసి అధ్యక్షులు షర్మిల క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసిన తర్వాత మాట్లాడితే బాగుంటుందన్నారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేతను నిరసిస్తూ భీమవరంలో 6న బహిరంగ సభ

● హాజరుకానున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గంలో బుల్డోజర్లతో పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని నిరసిస్తూ భీమవరంలో ఈ నెల ఆరో తేదీన సిపిఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం తెలిపారు. గరగపర్రు రోడ్డులోని డీమార్టు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మధ్యాహ్నం నిర్వహించబోయే బహిరంగ సభకు బాధిత ప్రజలు, జిల్లా ప్రజానీకం తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యవక్తగా హాజరుకానున్నారని తెలిపారు. వామపక్షాలు, ప్రజాసంఘాలు, దళిత సంఘాలతోపాటు వివిధ పార్టీల నేతలు హాజరుకానున్నట్లు చెప్పారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి వాసుదేవరావుతో కలిసి బలరాం మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతోందన్నారు. సుమారు 800 ఇళ్లు, చిన్న దుకాణాలను బుల్డోజర్లతో కూల్చేసి పేదలను రోడ్ల పాల్జేశారని గుర్తు చేశారు. ఇది సరిపోక ఇంకా కూల్చేస్తాం అని వందల సంఖ్యలో ఇళ్లకు నోటీసులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే తక్షణం ఈ ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాలకోడేరులో ఎఎస్ఆర్ నగర్, ఉండి ఎన్‌ఆర్‌పి అగ్రహారం, చెర్వుగట్టు కాలనీలు స్వయంగా పరిశీలించామన్నారు. ఇళ్ల తొలగింపు బడా భూస్వాముల ప్రయోజనాల కోసమేనని స్పష్టమైందని తెలిపారు. అనేక సమస్యలు జిల్లాలో పేరుకుపోయి ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషిచేస్తే అభివృద్ధి అవుతుందని, అంతేగాని ఇళ్లు కూలిస్తే అభివృద్ధి కాదని, ప్రజలు హర్షించరని తెలిపారు.

ప్రతి పంటకు మద్దతు ధర

● మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి పంటకు మద్దతు ధర కల్పిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. వైసిపి పాలనలో పండించిన పంటలకు మద్దతు ధర కల్పించకుండా రైతుల నుంచి కమీషన్లు తీసుకున్న నీచ చరిత్ర వైసిపి నేతలది అని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆరుగాలం శ్రమించి రైతు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలన్నా వైసిపి నేతలకు జె ట్యాక్స్ కట్టాల్సిన పరిస్థితి గతంలో ఉందని ఆరోపించారు. నేడు పంటలను నేరుగా అమ్ముకోవడంతోపాటు 24 గంటల్లోపు చెల్లింపులు చేస్తూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మార్కెట్‌లో ధర తక్కువ ఉన్న పంటలకు మార్క్‌ఫెడ్, ఇతర శాఖల ద్వారా కొనుగోలు చేస్తూ రైతులను ఆదుకుంటున్నామన్నారు.

క్వాంటం వ్యాలీ దేశానికే గర్వకారణం : విజయ్‌కుమార్

అమరావతిలో ఏర్పాటుకానున్న క్వాంటం వ్యాలీ దేశానికే గర్వకారణం అని టిడిపి అధికార ప్రతినిధి, బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ పేర్కొన్నారు. ఐబిఎం, టిసిఎస్‌తో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం ప్రజా రాజధాని పున:నిర్మాణానికి మంచి పరిణామమన్నారు.

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా క్వాంటం టెక్నాలజీ హబ్‌లు ఏడు మాత్రమే ఉన్నాయని తెలిపారు.

సంపాదకీయం

శాంతి కోసం ఎదురు చూపు

మణిపూర్ విధ్వంసానికి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్ల కాలం ఎన్నో విషాదకర సంఘటనలకు, మానవతా సంక్షోభానికి సాక్ష్యంగా నిలిచింది. రెండు తెగల మధ్య మతోన్మాద రాజకీయం సృష్టించిన విధ్వంసక క్రీడలో అమాయక ప్రజలు ఊచకోతకు గురైన మే 3వ తేదీ చరిత్రలో ఓ చేదు జ్ఞాపకం. ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే ఈ రాష్ట్రం, ఇప్పుడు భయం, అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతోంది. తెగల మధ్య నెలకొన్న వైషమ్యాలతో ఎన్నో కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోగా, మరెన్నో జీవితాలు శాశ్వతంగా గాయపడ్డాయి. ఈ ఘర్షణ దాని సామాజిక నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసి, రాష్ట్రాన్ని దీర్ఘకాలిక మానవతా సంక్షోభంలోకి నెట్టివేసింది. గత రెండేళ్లలో ఏం జరిగిందో ఒకసారి గుర్తు చేసుకుంటే, ఈ అల్లర్ల వెనుకనున్న శక్తులెవరో అర్థమవుతుంది. మెయిటీ, కుకీ తెగల మధ్య మొదలైన ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇళ్లు, చర్చిలు, ఆస్తులు ధ్వంసమయ్యాయి, స్త్రీలపై అత్యాచారం జరిగింది. మహిళలు, పిల్లలు సైతం హింసకు గురయ్యారు. 70వేల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులవ్వగా, 260మందికి పైగా మరణించారు. వందలాది ఇళ్లు, గ్రామాలు బూడిదయ్యాయి. నిరాశ్రయులైన ప్రజలు ఇప్పటికీ కొండలు, లోయలలోని సహాయ శిబిరాల్లో మగ్గుతున్నారు. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. 'హింస ఎప్పుడూ పరిష్కారం కాదు, అది కేవలం విధ్వంసాన్ని మాత్రమే తెస్తుంది' అంటారు గాంధీజీ. ఈ హింస మణిపూర్‌లో కూడా విధ్వంసాన్నే సృష్టించింది. ఇప్పటికీ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు.

రాష్ట్రంలోని రెండు ప్రధాన తెగల మధ్య పరస్పర అపనమ్మకం అనే అగాధం చాలా లోతుగా ఏర్పడింది. ఫలితంగా మణిపూర్ సమాజం తీవ్రంగా నష్టపోయింది. తరతరాలుగా కలిసి జీవించిన ప్రజల మధ్య అవిశ్వాసం పెరిగిపోయింది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. విద్య, వైద్యం వంటి ముఖ్యమైన రంగాలు కుంటుబడ్డాయి. భవిష్యత్తు తరాల మీద ఈ హింస యొక్క ప్రభావం చాలా కాలం పాటు ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. అల్లర్లను నివారించడానికి అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి ఒక తెగకు ప్రతినిధిగా వ్యవహరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పటికీ నిమ్మకునీరెత్తినట్లుగానే వుంది. ఇంత విధ్వంసం జరిగినా ప్రధాని మోడీ ఆ రాష్ట్రంవైపు కన్నెత్తి చూడకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతోంది. ప్రతిపక్ష పార్టీలు, మానవహక్కుల సంస్థలు, సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ శాంతిని నెలకొల్పడానికి కేంద్రప్రభుత్వం ఇప్పటికీ చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదన్నది సుస్పష్టం. ఆ రాష్ట్ర ప్రజలకన్నా తమ సొంత రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నట్లుగా వారి వ్యవహారశైలి కనిపిస్తోంది. 'గతం నుండి నేర్చుకోని వారు దానిని పునరావృతం చేయడానికి ఖచ్చితంగా సిద్ధంగా ఉంటారు' అని స్పానిష్-అమెరికన్ తత్వవేత్త జార్జ్ శాంటాయన అంటారు. ఈ సంఘటనలు మణిపూర్‌లో పునరావృతం కాకూడదు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో, శాంతి స్థాపన, బాధితులకు న్యాయం చేకూర్చడం అత్యంత ఆవశ్యకం. నిష్పక్షపాతంగా విచారణ జరిపి, హింసకు కారకులైన వారిని శిక్షించాలి. నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించాలి. ఇక్కడి ప్రజల మధ్య సయోధ్య కుదిర్చేందుకు చర్యలు చేపట్టాలి. 'న్యాయం ఆలస్యం అయితే, న్యాయం నిరాకరించినట్లే' అంటారు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్. రెండేళ్లపాటు మణిపూర్‌కు కేంద్రప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దడం అంత సులభం కాదు. 'ఎక్కడ అన్యాయం జరుగుతుందో, అక్కడ తిరుగుబాటనేది ఒక కర్తవ్యం' అంటారు థామస్ జెఫర్సన్. బాధితులకు న్యాయం జరగాలి. స్థానికంగా వున్న వివిధ తెగల ప్రతినిధులతో చర్చలు జరపడం ద్వారా ఇప్పటికే తగిలిన గాయాలను మాన్పేందుకు చర్యలు తీసుకోవాలి. సాధారణ పరిస్థితులు పునరుద్ధరించేందుకు, శాంతి సామరస్యతను పాదుగొలిపేందుకు న్యాయమైన పరిష్కారాలను కనుగొనడానికి అన్ని రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాలి. నిర్ధిష్ట కాలవ్యవధిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి. శాంతికోసం ఎదురుచూస్తోన్న ఆ ప్రజల హక్కులకు రక్షణగా నిలవాలి. అప్పుడే మణిపూర్ తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందగలదు.

మహనీయుల మాట



నిజం కూడా నిరంతరం ప్రచారంలో వుండాలి. లేకుంటే నిజం అబద్ధంగా మారుతుంది. రాష్ట్రాన్ని, దేశాన్నే గాదు ప్రపంచాన్ని సైతం ప్రమాదంలోకి నెడుతుంది!

- బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

అమరావతి: అప్పుడు మట్టి...ఇప్పుడు మాటలే!



తెలకపల్లి రవి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం పున:ప్రారంభోత్సవం ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరిగింది. చాలా ఆలస్యంగానైనా ఈ పున:ప్రారంభం జరిగినందుకు అందరూ సంతోషిస్తున్నారు. దేశంలో కొన్ని రాజధానుల నిర్మాణం, నిర్ణయంలో ముందు వెనకలు నిజమే కానీ ఈ విధంగా ఒకే చోట ఒకే ప్రధాని రెండుసార్లు ప్రారంభించడం జరిగి ఉండదు. దేశంలోనూ రాష్ట్రంలోనూ నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితులు, రాజకీయ పార్టీల అవకాశవాద పోకడలకు అద్దం పట్టే సందర్భం ఇది. 2015లో అక్టోబర్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఇదే కూటమి అధికారంలో ఉన్నప్పుడే అమరావతికి శంకుస్థాపన జరిగింది. జనసేన అధిపతి పవన్ కల్యాణ్ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం మినహా మిగిలిన వాతావరణం అచ్చం అదే. అందరూ వాళ్లే అయినప్పుడు పదేళ్ల ఆలస్యంగా మళ్లీ ప్రారంభించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్న అనివార్యం. అప్పుడు కూడా ఇదే నాయకులు ఇవే మాటలు చెప్పడం విన్న ప్రజలకు ఈ సందేహం రావడం సమర్థనీయమే. 2015-19 మధ్య కాలమంతా చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఆ దశలో సింగపూర్ భాగస్వామ్యం గురించి గొప్ప ప్రచారం కూడా జరిగినప్పటికీ రాజధాని ముందుకు కదల్లేదు ఎందుకు? శాసనసభ చర్చలో ఈ రాజధానికి మద్దతు ప్రకటించి, అధికారంలోకి వస్తే తాము దాన్ని నిలిపివేస్తామన్న ప్రచారంలో నిజం లేదని భరోసా ఇచ్చిన వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి హయాంలో అది ఎందుకు నిలిచిపోయింది? అప్పుడు, ఇప్పుడు, మధ్యలో జగన్ హయాంలోనూ రాష్ట్ర పాలకులతో రాజకీయ సాన్నిహిత్యం నడిపిన, వెంట తిప్పుకున్న ప్రధాని మోడీకి ప్రతిష్టంభనతో సంబంధం లేదా? జగన్ దాన్ని నిలిపివేసినప్పుడు అధికారికంగా గాని, రాజకీయంగా గాని జోక్యం చేసుకున్నది లేదు. రాజధాని పూర్తిగా రాష్ట్ర శాసనసభ నిర్ణయమని ఉన్నత న్యాయస్థానాల్లో అఫిడవిట్‌లు కూడా దాఖలు చేశారు. కేంద్రం ఆధ్వర్యంలోని 40 సంస్థలకు విలువైన భూములు కేటాయించినప్పటికీ ఏ నిర్మాణాలూ చేసింది లేదు. ఇన్ని అనుభవాలు ఉన్నాయి కనుక పున: ప్రారంభోత్సవం ఎంత ఆర్భాటంగా జరిపినా ఆచరణలో ఏం జరుగుతుందన్న ప్రశ్న తప్పనిసరి.

ఈసారి కూడా నిర్దిష్టమైన ప్రకటనలు గాని, నిధుల మంజూరు కానీ లేవు. ప్రపంచ బ్యాంకు, హడ్కోల నుంచి రూ.50 వేల కోట్ల అప్పు మాత్రం ఇప్పిస్తున్నారు. నక్షత్రకుడిలా వాళ్ళు మోడీ కన్నా ముందుగానే అమరావతి సందర్శించి ఆదేశాలు జారీ చేసి వెళ్లారు. కనీసం కేంద్ర ప్రభుత్వ సంస్థలను వేగంగా పూర్తి చేస్తామన్న హామీ కూడా మోడీ నుంచి వచ్చింది లేదు. కనెక్టివిటీ, రాకపోకల సంబంధాల పెరుగుదల గురించే ఆయన ఎక్కువగా మాట్లాడారు.



నిర్దిష్టమైన ప్రకటనలు, నిధుల మంజూరు ఏవీ!

గతం ఏమైనప్పటికీ అమరావతిలో కదలిక రావడాన్ని స్వాగతించవచ్చు. కానీ చరిత్ర పునరావృతం అవుతుందన్నట్లు నరేంద్ర మోడీ ప్రసంగం సాగింది. 2017లో వచ్చినప్పుడు ఎలాంటి ఆర్థిక సహాయం ప్రకటించింది లేదు. ప్రత్యేక హోదాకు విభజన చట్టంతో పాటు అవకాశం కల్పించిన చంద్రబాబు అడిగింది, మోడీ ఇచ్చింది శూన్యం. రూ.42 వేల కోట్ల మేరకు ఆర్థిక సహాయం కావాలని అప్పట్లో ప్రభుత్వం అడిగితే కేంద్రం రూ.1500 కోట్లు మాత్రమే సచివాలయం, శాసనసభ, రాజ్‌భవన్ వంటి వాటి కోసం కేంద్రం సహాయం చేసిందని అన్నారు. అవీ తాత్కాలిక నిర్మాణాలుగానే ఉండిపోయాయి. ఉత్సాహం కోసం నాడు చంద్రబాబు గ్రామ గ్రామాల నుంచి మట్టి తెప్పిస్తే... నేను సైతం అన్నట్టుగా మోడీ ఢిల్లీ నుంచి మట్టి, నీళ్లు తీసుకువచ్చి హాస్యాస్పద సన్నివేశం సృష్టించారు. దేశమంటే మట్టి కాదోయ్ అన్న గురజాడ సూక్తికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు. ఈ పున:ప్రారంభంలో ఆ మట్టి, నీళ్లు కూడా లేకపోవడం....ఒట్టిమాటలు కట్టిపెట్టోయ్ అన్న గురజాడనే మరోసారి తలపించింది. ఎందుకంటే ఈసారి కూడా నిర్దిష్టమైన ప్రకటనలు గాని, నిధుల మంజూరు కానీ లేవు. ప్రపంచ బ్యాంకు, హడ్కోల నుంచి రూ.50 వేల కోట్ల అప్పు మాత్రం ఇప్పిస్తున్నారు. నక్షత్రకుడిలా వాళ్ళు మోడీ కన్నా ముందుగానే అమరావతి సందర్శించి ఆదేశాలు జారీ చేసి వెళ్లారు. కనీసం కేంద్ర ప్రభుత్వ సంస్థలను వేగంగా పూర్తి చేస్తామన్న హామీ కూడా మోడీ నుంచి వచ్చింది లేదు. కనెక్టివిటీ, రాకపోకల సంబంధాల పెరుగుదల గురించే ఆయన ఎక్కువగా మాట్లాడారు.

చంద్రబాబు సాంకేతిక విజన్ గురించి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగానే తాను అధ్యయనం చేశానని మోడీ ప్రశంసలు కురిపించడం బాగానే ఉంది కానీ 2018లో వీరిద్దరూ విడిపోయి ఎంతగా ఆరోపణలు చేసుకున్నారో ఎలా మర్చిపోతాం? మోడీ నాయకత్వం ఉన్నందువల్లే భారతదేశం ప్రపంచ శక్తిగా ఆవిర్భవించిందని చంద్రబాబు పొగిడితే, బాబు దార్శనికత వల్లే అమరావతి పున: ప్రారంభమవుతోందని మోడీ కొనియాడారు. కేంద్ర వైఖరిలో మార్పును సూచించే ప్రకటనలు, నిధుల విడుదల లేకుండా, నిర్మాణం చేపట్టకుండా మోడీ వచ్చారని మురిసిపోవడంలో ఔచిత్యం ఉందా? భుజం కాయటం, అండగా నిలబడటం లాంటి మాటలు రాజధాని పూర్తి చేస్తాయా? జగన్ ప్రభుత్వం అమరావతిని ఉన్న ఫళాన నిలిపివేసినప్పుడు కూడా మోడీ ఆయనతో ఉన్నారు. అమరావతి ఉద్యమం పట్ల బిజెపి వైఖరి ఏమిటి అన్నది కూడా చాలా కాలం పాటు అయోమయంగానే ఉండింది. చివరకు రైతులు తిరుపతి యాత్ర చేసిన సమయంలోనే బిజెపి బహిరంగంగా మద్దతు తెలిపింది. ఏది ఏమైనా రాజధాని నిర్మాణం భారం ఏపీ ప్రభుత్వమే మోయాలి అన్నది మోడీ వైఖరిగా స్పష్టమవుతుంది. ప్రపంచ బ్యాంకు అప్పు కేంద్రమే చెల్లిస్తుందని ఏపీ బిజెపి నాయకులు చెప్పే మాటలకు ఆధారంగా అధికార పత్రం ఏమైనా ఉందా? మధ్యలో దాన్ని నిలిపివేసిన జగన్ పైన కూడా ఆయన ఏమీ పెదవి మెదపలేదు.

సందేహాల మధ్య 'నమో' భజన

బాబు, పవన్, లోకేష్‌ల విషయానికి వస్తే అమరావతి నరేంద్ర మోడీ భజనతో మార్మోగింది. నమో మిసైల్ అని కూడా లోకేష్ అభివర్ణించారు. కాశ్మీర్‌లో ఉగ్రవాద మారణకాండ నేపథ్యంలో పాకిస్తాన్‌తో ఏర్పడిన ఉద్రిక్తతలను ప్రస్తావిస్తూ మోడీని మహాశక్తిగా అలౌకిక భాషలో కీర్తించటం హాస్యాస్పదం. అన్ని పార్టీలు ఉగ్రవాదంపై పోరాటానికి మద్దతునిచ్చిన మాట నిజమే. వ్యక్తిగతంగా మోడీ ఏదో ఒంటరిగా పోరాడుతున్నట్లు చెప్పడం అశేష ప్రజానీకాన్ని తక్కువ చేయటం లాంటిదే. ఈ ముగ్గురి ప్రసంగాలలోనూ జగన్ నిర్వాకాన్ని తీవ్రంగానే అభిశంసించారు. కానీ ఆయనకు మోడీ ఆశీర్వాదాలు అందించారనే అంశాన్ని దాటేశారు. రాజధాని నిలిచిపోయిన సమయంలో పోరాడిన రైతులను, ముఖ్యంగా మహిళలను ప్రశంసించటం బాగుంది కానీ 914 సి.ఆర్.డి.ఏ ఒప్పందంలోని అనేక అంశాలను ఇంకా అమలు చేయలేకపోయిన పరిస్థితిని మాత్రం చెప్పలేదు. విమానాశ్రయం కోసం మరో 45 వేల ఎకరాలు సమీకరించటం గురించి మాట్లాడలేదు. రైతాంగంలో ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం అవటం ఇందుకు కారణం కావచ్చు. పదేళ్ల తర్వాత పున: ప్రారంభం చేసుకుంటున్న అమరావతిపై సర్వ శక్తి యుక్తులు పెట్టే బదులు మరేదో నిర్మించాలని భూమి సేకరించటం అంతు పట్టని విషయం. గన్నవరం విమానాశ్రయం కోసం సేకరించిన భూములకే ఇంకా పరిష్కారం దొరకలేదు. అమరావతి వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకోవడం ఒకటైతే అది విశ్వనగరంగా దేశ అభివృద్ధికి కేంద్రంగా మారిపోతుందని చెప్పడం ఎలా కుదురుతుంది? కొద్దిరోజుల కిందట మంత్రి నారాయణ మాట్లాడుతూ విజయవాడ గుంటూరుతో కలిపి అమరావతిని మెగా సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. అదే విధానమైతే చాలా సమస్యలు వచ్చి వుండేవే కావు. ఇప్పుడు కూడా ఒకే చోట మొత్తం కేంద్రీకరిస్తే ప్రజలు ఆమోదించరు. చంద్రబాబు అది గ్రహించబట్టే సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని లేట్‌గా ట్వీట్ చేశారు.

మారని వైసిపి - అదే పాట

ఇదే సమయంలో వైసిపి నాయకులు పున:ప్రారంభంపై చేసే విమర్శకు ఔచిత్యం లేదు. దాన్ని పూర్తిగా పక్కకు నెట్టి మూడు రాజధానుల ముచ్చటతో కాలం గడిపి ఇప్పుడు దీనిపైన దాడి చేయటాన్ని ప్రజలు హర్షించరు. రాజధాని కట్టే బదులు మహానగరం అంటూ చంద్రబాబు పక్కదోవ పట్టించారని వారు అంటున్నారు. మరి తాము రాజధాని వరకే పరిమితమై కట్టి ఉండాలి కదా? దాదాపు పూర్తయిన భవనాలను కూడా పాడు పెట్టడం, మొత్తం అడవిలా అల్లుకుపోతుంటే ఉపేక్షించడం ఎంత బాధ్యతా రాహిత్యం? తమకు 40 శాతం మంది ఓట్లేశారు కనుక వారంతా అమరావతికి వ్యతిరేకమేనని కొంతమంది వైసిపి వర్గాలు చెప్పుకోడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటుకు అన్ని పార్టీలు అంగీకారం తెలిపినప్పటికీ ఆ దిశలోనైనా వైసిపి ప్రభుత్వం చేసింది ఏంటి? విశాఖలో పాలనా రాజధాని అంటూ రిషికొండపై వేల కోట్లు ఖర్చు చేయడం తప్ప నిజంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి?

ప్రజా రాజధానిగా అమరావతి అనే పల్లవిని మళ్లీ వినిపిస్తున్నదిగానీ పెట్టుబడి పెట్టే ప్రపంచ బ్యాంకు అందుకు ఒప్పుకోవటం జరిగే పనేనా? ఇప్పటికే రాజధానిలో పెట్టిన ఖర్చు రాబట్టడం ఎలాగనే చర్చ బ్యాంకు లేవనెత్తుతున్నది. ఆ అప్పులతో రాజధాని కట్టడం అంటే అడుగడుగునా ఆంక్షలు, షరతులకు తల వంచడమే. ఏమైనా రాజధాని ప్రక్రియను వేగంగా, ప్రజోపయోగకరంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. మూడేళ్లలో పనులు పూర్తి అవుతాయి అంటే అర్థం అప్పటికి ఈ ప్రభుత్వం చివరి ఏడాది పాలనలో ఉంటుంది. జమిలి ఎన్నికలు వంటి మాటలు వింటున్న దృష్ట్యా ఈ లోగా కూడా ఏం జరుగుతుందో చూడాల్సిందే.

ప్రజా రాజధానిగా అమరావతి అనే పల్లవిని మళ్లీ వినిపిస్తున్నదిగానీ పెట్టుబడి పెట్టే ప్రపంచ బ్యాంకు అందుకు ఒప్పుకోవటం జరిగే పనేనా? ఇప్పటికే రాజధానిలో పెట్టిన ఖర్చు రాబట్టడం ఎలాగనే చర్చ బ్యాంకు లేవనెత్తుతున్నది. ఆ అప్పులతో రాజధాని కట్టడం అంటే అడుగడుగునా ఆంక్షలు, షరతులకు తల వంచడమే. ఏమైనా రాజధాని ప్రక్రియను వేగంగా, ప్రజోపయోగకరంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. మూడేళ్లలో పనులు పూర్తి అవుతాయి అంటే అర్థం అప్పటికి ఈ ప్రభుత్వం చివరి ఏడాది పాలనలో ఉంటుంది. జమిలి ఎన్నికలు వంటి మాటలు వింటున్న దృష్ట్యా ఈ లోగా కూడా ఏం జరుగుతుందో చూడాల్సిందే.

అప్పుడు, ఇప్పుడు, మధ్యలో జగన్ హయాంలోనూ రాష్ట్ర పాలకులతో రాజకీయ సాన్నిహిత్యం నడిపిన, వెంట తిప్పుకున్న ప్రధాని మోడీకి ప్రతిష్టంభనతో సంబంధం లేదా? జగన్ దాన్ని నిలిపివేసినప్పుడు అధికారికంగా గాని, రాజకీయంగా గాని జోక్యం చేసుకున్నది లేదు. రాజధాని పూర్తిగా రాష్ట్ర శాసనసభ నిర్ణయమని ఉన్నత న్యాయస్థానాల్లో అఫిడవిట్‌లు కూడా దాఖలు చేశారు. కేంద్రం ఆధ్వర్యంలోని 40 సంస్థలకు విలువైన భూములు కేటాయించినప్పటికీ ఏ నిర్మాణాలూ చేసింది లేదు. ఇన్ని అనుభవాలు ఉన్నాయి కనుక పున: ప్రారంభోత్సవం ఎంత ఆర్భాటంగా జరిపినా ఆచరణలో ఏం జరుగుతుందన్న ప్రశ్న తప్పనిసరి.

ఉచ్చులోనే ప్రాంతీయ పార్టీలు

రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకు పడే వైసిపి కేంద్రాన్ని మాత్రం పల్లెత్తు మాట అనదు. వైసిపి విషయంలో బిజెపి ఇంకా పాత సంబంధాలు తెంచుకోలేదనే సమాచారం ఒకటైతే వీరు కూడా దాన్ని కాపాడుకోవాలని చూస్తున్నారని ఆ వర్గాల కథనం. ఈ సమయంలో తెలంగాణ రాజకీయాలు చూస్తే రజతోత్సవం పేరిట భారీగా సభ జరిపిన టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కూడా తన సుదీర్ఘ ప్రసంగంలో ఒక్క వాక్యం మినహా బిజెపిని, కేంద్రాన్ని విమర్శించింది లేదు. తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని, ఏకైక విలనని పదేపదే చెప్పడం ద్వారా ఆయన బిజెపికి సంతోషం కలిగించారు. వచ్చేసారి తామే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని బిజెపి అదే పనిగా ప్రచారం చేసుకుంటున్నా టిఆర్ఎస్ కు బిజెపితో పోరాడటం ప్రధానాంశంగా లేదని కెసిఆర్ తేల్చేశారు. పవన్ కల్యాణ్ వంటి వారు ఎంతగా బిజెపిని మోస్తున్నప్పటికీ తెలంగాణలో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఆ పార్టీ నేతలు ప్రకటించేశారు. అయినా ఏపీలో మాత్రం వారు పూర్తిగా బిజెపిని సంతోష పెట్టే దిశలోనే పని చేస్తున్నారు. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని కూడా ఇటీవల తెలుగుదేశం బిజెపికే కేటాయించింది. కాశ్మీర్ ఉగ్రవాద హత్యాకాండ సాకుగా చూపి మతాల మధ్య స్పర్థ పెంచటం మంచిది కాదని సరైన మాట చెప్పినందుకు తెలుగుదేశం అధికార ప్రతినిధి గాయత్రిని బిజెపి సస్పెండ్ చేయించింది. ఈ విధంగా తెలుగు రాష్ట్రాల్లో నాలుగు ప్రాంతీయ పార్టీలు బిజెపి ఉచ్చులో పడిపోవటం ఆమోదించలేని విషయం. ★

సందర్భం

మే20 సార్వత్రిక సమ్మె-డిమాండ్లు

కె. చంద్రన్ పిళ్ళై

ఈ ఏడాది మార్చి 18న ఢిల్లీలో సమావేశమైన కేంద్ర కార్మిక సంఘాలు, వివిధ రంగాల జాతీయ సమాఖ్యలు, సంఘాల సంయుక్త సమావేశం మే 20న జాతీయ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది.

ఈ జాతీయ సమ్మె 17 అత్యవసర డిమాండ్లను లేవనెత్తింది. వీటితో పాటు, ఆయా రంగాలలోని యూనియన్లకు తమ నిర్దిష్ట డిమాండ్లను జోడించే అవకాశం కల్పించింది.

మొదటి, ముఖ్యమైన డిమాండ్ కార్మిక కోడ్‌లను రద్దు చేయడం. 2014 నుండి మోడీ ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తున్న విషయం ఏమిటంటే, దేశంలో ఉన్న కార్మిక చట్టాలను పూర్తిగా సవరించి వాటిని కేవలం నాలుగుకు తగ్గించడం. 29 కేంద్ర చట్టాలు, వందలాది రాష్ట్ర చట్టాలు ఉన్న ఉమ్మడి జాబితాలోని కార్మిక చట్టాలను నాలుగుకు తగ్గించడం. కార్మిక చట్టాలన్నీ అంతిమంగా కార్మికులను రక్షించడానికే రూపొందించబడ్డాయి. దీనిని పరిగణనలోకి తీసుకోకుండా ఉన్న చట్టాలను పూర్తిగా రద్దు చేయడం ద్వారా, పని ప్రదేశంలో కార్మికుల రక్షణ, సేవ, వేతన పరిస్థితుల పరంగా ప్రస్తుత పరిస్థితులను మోడీ సర్కారు దెబ్బతీయబోతున్నది.

నేడు మన దేశంలో కార్మికులు అనుభవిస్తున్న హక్కులు కార్మిక చట్టాలపై ఆధారపడి ఉన్నాయి. ఆ చట్టాల సారాంశం కార్మికుల రక్షణ. ఈ చట్టాలు వారిని ఒకచోటకు చేర్చి ముందుకు నడిపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే వారు సమిష్టిగా బేరసారాలు చేయడానికి గొప్ప అవకాశాన్ని సష్టిస్తాయి. అయితే, ట్రేడ్ యూనియన్ సంస్థలను, సమిష్టి బేరసారాలను బలహీనపరచాలని చూస్తోంది మోడీ ప్రభుత్వం. దీనిని తిప్పికొట్టడం కార్మికుల ముందున్న కర్తవ్యం.

ఇవీ సమ్మె డిమాండ్లు

1. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి.
2. కనీస వేతనం నెలకు రూ. 26,000 చెల్లించాలి. కాంట్రాక్ట్ కార్మికులను, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలి.



3. ఉపాధిని అవుట్‌సోర్సింగ్ చేయడం, పరిమిత-కాల ఉపాధిని తీసుకురావడం ఆమోదయోగ్యం కాదు. అన్ని రకాల కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి.
4. ఇ.పి.ఎఫ్ పెన్షన్ కనీసం రూ. పది వేలు చెల్లించాలి. వ్యవసాయ కార్మికులతో సహా అన్ని వర్గాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. గిగ్ వర్కర్లు, మత్స్యకారులు, గృహ కార్మికులు, అతిథి కార్మికులు, స్కీమ్ వర్కర్లు, పోర్టర్లు, దుకాణదారులు, మోటారు కార్మికులు, నిర్మాణ కార్మికులు, భద్రతా కార్మికులు, హౌస్ కీపింగ్ కార్మికులు మొదలైన వారికి వైద్య సహాయం, క్రమబద్ధమైన ఆదాయం, పెన్షన్ ఉండేలా చూడాలి.
5. ఎన్.పి.ఎస్-యు.పి.ఎస్ ని రద్దు చేసి పాత చట్టబద్ధమైన పెన్షన్‌ను పునరుద్ధరించాలి.
6. పిఎఫ్ , బోనస్‌పై ఉన్న అన్ని పరిమితులను తొలగించాలి. గ్రాట్యుటీ మొత్తాన్ని పెంచాలి.
7. దరఖాస్తు సమర్పించిన 45 రోజుల్లోపు ట్రేడ్ యూనియన్‌ను నమోదు చేసుకోవాలి. సమ్మె కార్మికుల హక్కు అని ప్రకటించిన ఐ.ఎల్.ఒ కన్వెన్షన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి.
8. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలి. ఆహార పదార్థాలు, మందులు, వ్యవసాయ పరికరాలు మొదలైన వాటిపై వస్తు సేవల పన్నును మినహాయించాలి. వంట గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికం చేయడం ద్వారా ఆహార భద్రత కల్పించాలి.
9. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేయడాన్ని ఆపాలి. జాతీయ ఆస్తుల అమ్మకాన్ని నిలిపివేయాలి. ఖనిజ వనరుల తవ్వకాల ప్రతిపాదిత చట్టాన్ని సవరించాలి. బొగ్గు, ఇతర గనుల నుండి వచ్చే లాభాలలో 50 శాతాన్ని సంబంధిత కార్మికుల కోసం, ముఖ్యంగా రైతులు, గిరిజన వర్గాల సంక్షేమం కోసం కేటాయించాలి.
10. ప్రభుత్వం అన్ని ఆహార ధాన్యాలను స్వామినాథన్ సిఫార్సు ప్రకారం (సి2 ప్లస్ 50) మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. విత్తనాలు, ఎరువులు, విద్యుత్తుపై రైతులకు ఇచ్చే రాయితీలను పెంచాలి. పంటల బీమాను ప్రవేశపెట్టాలి. రుణ బాధ్యతను రద్దు చేయాలి. కిసాన్ మోర్చా ప్రారంభించిన చారిత్రాత్మక పోరాటం నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన అన్ని లిఖితపూర్వక హామీలను వెంటనే అమలు చేయాలి.
11. విద్యుత్ సవరణ చట్టం-2022ని రద్దు చేయాలి. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణను విరమించుకోవాలి. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి.
12. ఉపాధిని ప్రాథమిక హక్కుగా చేయాలి. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. సంవత్సరానికి 200 రోజుల ఉపాధి హామీ ఇవ్వాలి. రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి.
13. అందరికీ ఉచిత విద్యను అందించాలి. ఆరోగ్య సంరక్షణ, తాగు నీరు, పారిశుధ్యం, గృహ నిర్మాణం వంటి అంశాలపై ప్రభుత్వం హామీ ఇవ్వాలి. 2020 నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలి.
14. అటవీ హక్కుల చట్టాన్ని (ఎఫ్.ఆర్.ఎ) కఠినంగా అమలు చేయాలి. జీవ వైవిధ్య చట్టం, 2023-అటవీ వినియోగ చట్టానికి చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలి. అటవీ భూములను పెద్ద ఎత్తున దోచుకోవడానికి ప్రభుత్వానికి అధికారాలను కట్టబెట్టే సవరణలన్నిటినీ తొలగించాలి. తద్వారా అటవీ భూమిని రక్షించాలి.

నేడు మన దేశంలో కార్మికులు అనుభవిస్తున్న హక్కులు కార్మిక చట్టాలపై ఆధారపడి ఉన్నాయి. ఆ చట్టాల సారాంశం కార్మికుల రక్షణ. ఈ చట్టాలు వారిని ఒకచోటకు చేర్చి ముందుకు నడిపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే వారు సమిష్టిగా బేరసారాలు చేయడానికి గొప్ప అవకాశాన్ని సష్టిస్తాయి. అయితే, ట్రేడ్ యూనియన్ సంస్థలను, సమిష్టి బేరసారాలను బలహీనపరచాలని చూస్తోంది మోడీ ప్రభుత్వం. దీనిని తిప్పికొట్టడం కార్మికుల ముందున్న కర్తవ్యం.

15. భవన నిర్మాణ కార్మికులు, స్కీమ్ వర్కర్లను ఇ.ఎస్.ఐ పరిధిలోకి తీసుకురావాలి. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులందరికీ కార్మిక సంక్షేమ నిధిని ఉపయోగించి ఆరోగ్య బీమా, ప్రసూతి ప్రయోజనాలు వంటి సహాయక చర్యలు అందించాలి. ఇంటి పనివారికి ఐ.ఎల్.ఒ సిఫార్సులను వర్తింపజేయడం ద్వారా ఉద్యోగ భద్రతను కల్పించేలా చట్టం రూపొందించాలి.
16. బిలియనీర్లపై కార్పొరేట్ పన్ను, ఇతర మూలధన పన్నులను పెంచడం ద్వారా సామాజిక సంక్షేమానికి డబ్బును సేకరించాలి.
17. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి హామీ ఇచ్చిన మత స్వేచ్ఛ, సాంస్కృతిక బహుళత్వం, భాష, సమానత్వం వంటి వాటిని దెబ్బ తీసే, దేశ సమాఖ్య వ్యవస్థను బలహీన పరిచే చర్యలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవాలి.

సార్వత్రిక సమ్మె ప్రకటించినప్పటి నుండి గత నెల రోజులుగా కార్మిక వర్గం అపూర్వమైన రీతిలో సన్నద్ధమవుతోంది. జమ్ము కాశ్మీర్, గుజరాత్, ఈశాన్య ప్రాంతాలతో సహా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున సన్నాహాలు జరుగుతున్నాయి. ఒకటి మాత్రం ఖాయం. భారతదేశంలో ఇప్పటి వరకు జరిగిన సమ్మెలలో ఇది అతి పెద్ద సమ్మె కానుంది. ఎలాంటి మినహాయింపులు లేకుండా సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొన్న అరుదైన చిత్రం మోడీ ప్రభుత్వానికి బలమైన హెచ్చరిక అవుతుంది.

/ 'దేశాభిమాని' సౌజన్యంతో/

కవిత్వం

రైళ్లలో బోగీలు పెంచండి

గత పది సంవత్సరాలలో రైల్వే శాఖ ఎన్నో మార్పులు చేసుకుంటూ అన్ని వ్యవస్థల వలే పెరుగుతున్న ఆధునికతను తమ శాఖలో అమలు పరచుకుంటూ వస్తున్నది. ఇటీవల రైలులో ఎటిఎం సేవలను రైల్వే శాఖ ప్రయోగాత్మకంగా అందుబాటు లోకి తీసుకు రావడం హర్షించదగ్గ విషయం. అయితే రైళ్లలో ఎక్కువగా ప్రయాణించే పేదవాళ్ల కోసం రైల్వే ఆలోచించడం లేదు. ప్రతీ ట్రైన్ కి ఏసీ, స్లీపర్ క్లాస్ బోగీలను పెంచుతున్నారే కానీ మధ్య తరగతి వారు పేదలు ఎక్కువగా ప్రయాణించే సెకండ్ క్లాస్ జనరల్ బోగీలను తగ్గిస్తున్నారు. ముందు రైల్వే శాఖ వారు వీటిని పెంచడంపై దృష్టి పెట్టండి. అలాగే సీనియర్ సిటిజన్లకు టికెట్ రాయితీని వెంటనే పునరుద్ధ రించాలని మనవి.

- దాసం వెంకటరెడ్డి,
ఊరదాళ్ళపాలెం,
పశ్చిమ గోదావరి జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

రానున్న 2 రోజుల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు శనివారం ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని చోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నెల 4న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణ, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ సోమ, మంగళవారాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. అలాగే రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. శనివారం తిరుపతి జిల్లా మంగ నెల్లూరులో 42.9 డిగ్రీలు, ప్రకాశం జిల్లా బొట్లగూడరూరులో 41.5, పల్నాడు జిల్లా క్రోసూరులో 41 చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम

గుంటూరు శాఖ : 4/14, 4వ లేన్, బ్రాడీపేట, గుంటూరు-522 002.
ఫోన్ నం.: 0863- 2230527, 2337471
ఇ మెయిల్ : bom411@mahabank.co.in, brmgr411@mahabank.co.in

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 3(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (సర్ఫాసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరుశాఖలో సర్ఫాసీ చట్టం యొక్క సెక్షన్13(2) క్రింద పేర్కొన్న తేదీలలో బ్యాంక్ నోటీసు జారీ చేసి క్రింది రుణగ్రహీత ఖాతాలు ఎన్‌పిఎగా వర్గీకరించబడ్డాయి. సంబంధిత అందరి సమాచారం కొరకు ఈ పబ్లిక్ నోటీసు ప్రచురించబడుతోంది. డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు అమలు చేయబడిన లోన్/ ఇతర ఒప్పందాలు మరియు పత్రాలు సంబంధిత వ్యక్తుల ద్వారా క్రింద చెల్లింపు తేదీ వరకు దిగువ సూచించిన మొత్తాన్ని ఒప్పంద రేట్లలో భవిష్యత్తు వడ్డీతో క్రింద పేర్కొన్న రుణగ్రహీత/ హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర గుంటూరు శాఖకు చెల్లించవలసి ఉంటుంది. పేర్కొన్న ఒప్పందాలు మరియు పత్రాల ప్రకారం రుణగ్రహీతల బాధ్యతకు భద్రతగా, సంబంధిత ఆస్తులు పేర్లకు వ్యతిరేకంగా చూపించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖకు ఛార్జ్ చేయబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీతలు మరియు హామీదారుల పేరు మరియు చిరునామా/శాఖ	బకాయి మొత్తం (02.05.2025 నాటికి)	
1	శాఖ : గుంటూరు **1. మెసెర్స్.యాక్సిస్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రొప్రైటర్. శ్రీమతి. పులిమద్ది శైలాబీ,** డో.నం.58-2-3/2, ఫ్లాట్ నం.1డి, 1వ అంతస్తు, ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద, భాగయ్య వీధి ఎన్ టి ఆర్ సర్కిల్ వద్ద, విజయవాడ-520004. **2. శ్రీమతి. పులిమద్ది శైలాబీ (ప్రొప్రైటర్/ తనఖాదారు),** డో.నం.53-126ఎ, 7వ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద, ఆరుల్ నగర్, గుణదల, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్-520004.	**రూ.2,98,24,173/-** (రెండు కోట్ల తొంభై ఎనిమిది లక్షల ఇరవై నాలుగు వేల ఒక వందా డెభై మూడు రూపాయలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ/ **03.05.2025** నుండి వర్తించే రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ ఖర్చు మరియు ఇతర ఖర్చులు మొదలైనవి.	
	టిఎల్ : రూ.20.00 లక్షలు (ఇరవై లక్షలు మాత్రమే) మరియు సిసి : రూ.280.00 లక్షలు (రెండు కోట్ల ఎనభై లక్షలు మాత్రమే)	**డిమాండ్ నోటీసు తేది : 02.05.2025**	**ఎన్‌పిఎ తేది : 31.03.2025**

ప్రాథమిక సెక్యూరిటీ : 1. స్టాక్ మరియు బుక్ డెబ్ట్స్ హైపోథికేషన్, 2. ప్లాంట్ మరియు మిషనరీ హైపోథికేషన్.
అనుషంగిక సెక్యూరిటీ : తనఖాకు సమానమైన ఆస్తి (సిఇఆర్ఎస్ఎఐ ఐడి : 200081290557)
ఆస్తి షెడ్యూల్ : గుంటూరు జిల్లా, తాడికొండ రిజిస్ట్రేషన్ జిల్లా, తాడికొండ ఉపజిల్లా, తాడికొండ ఎస్ఆర్ఓ, తాడికొండ రెవెన్యూ మండలం, కంతేరు గ్రామం వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఖాళీ సైట్ మొత్తం ఆ ముక్కలు మరియు పార్శిళ్లు డో.నం.121 విస్తీర్ణం 4646.39 చ.గ.లు./ లేదా ఎ.లు. 0.96 సెంట్లు. **హద్దులు : తూర్పు:** 30 అ.లు. వెడల్పు రోడ్డు కొంత మేరకు మరియు తోకల వీరయ్య స్థలంలో విభజించబడిన ప్లాట్లు కొంత మేరకు, **దక్షిణం :** షేక్ హుస్సేన్ స్థలం, **పడమర :** గద్దె అంజి రెడ్డి స్థలం, **ఉత్తరం :** నీరుకొండ సీతమ్మ స్థలం. తో కలిపి రెసిడెన్షియల్/ కమర్షియల్ స్థలం కొలత 943.80 చ.గ.లు. లేదా 789.139 చ.మీ.లు. మరియు అనుబంధ లిస్ట్ ప్రకారం దానిపై అన్నీ అనుబంధ ఫిక్చర్లు

సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖకు చెల్లింపు చేయడంలో విఫలమైతే, చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించే నిబంధనల ప్రకారం పూర్తిగా సంబంధిత రుణగ్రహీతలు/హామీదారుల నష్టాలకు సంబంధించి పైన పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌కు వ్యతిరేకంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ కొనసాగడానికి అర్హత కలిగి ఉంటుంది. సర్ఫేసీ యాక్ట్ యొక్క నిబంధనల ప్రకారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ శాఖ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా సంబంధిత రుణగ్రహీతలు / హామీదారులు పైన పేర్కొన్న ఆస్తులను ఏ పద్ధతిలోనైనా, ఖర్చులు మరియు పరిణామాలు, అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయకుండా నిషేధించబడ్డారు, పేర్కొన్న నిబంధనలకు ఏదైనా ఉల్లంఘన జరిగితే సర్ఫేసీ యాక్ట్ ప్రకారం సంబంధిత వ్యక్తులు శిక్ష మరియు/ లేదా పెనాల్టీకి బాధ్యత వహించగలరు. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది. మరిన్ని వివరాలకు దిగువసంతకందారు నుండి సర్వ్ చేయబడని తిరిగివచ్చిన నోటీసులను సేకరించవచ్చును. ఈ నోటీసు కూడా ప్రచురితమవుతుంది.

తేది : 03.05.2025
ప్రదేశం : విజయవాడ
సం/- చీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम

గుంటూరు శాఖ : 4/14, 4వ లేన్, బ్రాడీపేట, గుంటూరు-522 002.
ఫోన్ నం.: 0863- 2230527, 2337471
ఇ మెయిల్ : bom411@mahabank.co.in, brmgr411@mahabank.co.in

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 3(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (సర్ఫాసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరుశాఖలో సర్ఫాసీ చట్టం యొక్క సెక్షన్13(2) క్రింద పేర్కొన్న తేదీలలో బ్యాంక్ నోటీసు జారీ చేసి క్రింది రుణగ్రహీత ఖాతాలు ఎన్‌పిఎగా వర్గీకరించబడ్డాయి. సంబంధిత అందరి సమాచారం కొరకు ఈ పబ్లిక్ నోటీసు ప్రచురించబడుతోంది. డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు అమలు చేయబడిన లోన్/ ఇతర ఒప్పందాలు మరియు పత్రాలు సంబంధిత వ్యక్తుల ద్వారా క్రింద చెల్లింపు తేదీ వరకు దిగువ సూచించిన మొత్తాన్ని ఒప్పంద రేట్లలో భవిష్యత్తు వడ్డీతో క్రింద పేర్కొన్న రుణగ్రహీత/ హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర గుంటూరు శాఖకు చెల్లించవలసి ఉంటుంది. పేర్కొన్న ఒప్పందాలు మరియు పత్రాల ప్రకారం రుణగ్రహీతల బాధ్యతకు భద్రతగా, సంబంధిత ఆస్తులు పేర్లకు వ్యతిరేకంగా చూపించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖకు ఛార్జ్ చేయబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీతలు మరియు హామీదారుల పేరు మరియు చిరునామా/శాఖ	బకాయి మొత్తం (02.05.2025 నాటికి)	
1	శాఖ : గుంటూరు **1. మెసెర్స్.పవన్ కాటన్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్,** డో.నం.4-20-34, 4వ లైన్, 1వ క్రాస్ రోడ్డు, నవభారత్ నగర్, గుంటూరు-522 006. **2. శ్రీ.ఉప్పుటూరి గోపాల్‌రావు (హామీదారులు/ తనఖాదారులు),** డో.నం.4-20-34, 4వ లైన్, 1వ క్రాస్ రోడ్డు, నవభారత్ నగర్, గుంటూరు-522 006. **3. శ్రీమతి. ఉప్పుటూరి లక్ష్మి (డైరెక్టర్ మరియు హామీదారులు),** డో.నం.4-20-34, 4వ లైన్, 1వ క్రాస్ రోడ్డు, నవభారత్ నగర్, గుంటూరు-522 006.	**రూ.8,24,64,230/-** (ఎనిమిది కోట్ల ఇరవై నాలుగు లక్షల అరవై నాలుగు వేల రెండు వందల ముప్పై రూపాయలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ/ **03.05.2025** నుండి వర్తించే రేటు ప్రకారం భవిషత్తు వడ్డీ ప్లస్ ఖర్చు మరియు ఇతర ఖర్చులు మొదలైనవి.	
	సిసి : రూ.295.00 లక్షలు (రెండు కోట్ల తొంభై ఐదు లక్షల రూపాయలు మాత్రమే) డబ్ల్యుసిటిఎల్ : రూ.500.00 లక్షలు (ఐదు కోట్ల రూపాయలు మాత్రమే) డబ్ల్యుసిటిఎల్ : రూ.400.00 లక్షలు (నాలుగు కోట్ల రూపాయలు మాత్రమే) జిఇసిఎల్ : రూ.80.00 లక్షలు (ఎనభై లక్షల రూపాయలు మాత్రమే)	**డిమాండ్ నోటీసు తేది : 02.05.2025**	**ఎన్‌పిఎ తేది : 31.03.2025**

ప్రాథమిక సెక్యూరిటీ : స్టాక్ మరియు బుక్ డెబ్ట్స్ హైపోథికేషన్, ప్లాంట్ మరియు మిషనరీ మరియు తనఖాకు సమానమైన కమర్షియల్ ఆస్తి
అనుషంగిక సెక్యూరిటీ : తనఖాకు సమానమైన స్థిరాస్తులు (సిఇఆర్ఎస్ఎఐ ఐడి : 200043692545)
ఆస్తి షెడ్యూల్ : గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరు మండలం, పుల్లడిగుంట గ్రామం, కొర్నెపాడు గ్రామం, మల్లినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కాలేజి ఫర్ ఉమన్ వద్ద ఎస్వై.నం.373/బి, 373/సి, 373/ఎ/సి లో ఉన్న ఫ్యాక్టరీ స్థలం మరియు భవనం కలిగి ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ కొలత 6.2175 సెంట్లు. క్రింది విధంగా ఉన్న హద్దులు : ఉత్తరం : వెంపరాల వెంకటరావు స్థలం కవర్‌చేయబడిన బివై.డో.నం.374, దక్షిణం : ఉప్పుటూరి హనుమయ్య స్థలం, తూర్పు : గుంటూరు-ప్రత్తిపాడు రోడ్డు, పడమర : నార్నె రామకోటయ్య స్థలం.

సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖకు చెల్లింపు చేయడంలో విఫలమైతే, చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించే నిబంధనల ప్రకారం పూర్తిగా సంబంధిత రుణగ్రహీతలు/హామీదారుల నష్టాలకు సంబంధించి పైన పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌కు వ్యతిరేకంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ కొనసాగడానికి అర్హత కలిగి ఉంటుంది. సర్ఫేసీ యాక్ట్ యొక్క నిబంధనల ప్రకారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ శాఖ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా సంబంధిత రుణగ్రహీతలు / హామీదారులు పైన పేర్కొన్న ఆస్తులను ఏ పద్ధతిలోనైనా, ఖర్చులు మరియు పరిణామాలు, అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయకుండా నిషేధించబడ్డారు, పేర్కొన్న నిబంధనలకు ఏదైనా ఉల్లంఘన జరిగితే సర్ఫేసీ యాక్ట్ ప్రకారం సంబంధిత వ్యక్తులు శిక్ష మరియు/ లేదా పెనాల్టీకి బాధ్యత వహించగలరు. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది. మరిన్ని వివరాలకు దిగువసంతకందారు నుండి సర్వ్ చేయబడని తిరిగివచ్చిన నోటీసులను సేకరించవచ్చును. ఈ నోటీసు కూడా ప్రచురితమవుతుంది.

తేది : 03.05.2025
ప్రదేశం : విజయవాడ
సం/- చీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम

గుంటూరు శాఖ : 4/14, 4వ లేన్, బ్రాడీపేట, గుంటూరు-522 002.
ఫోన్ నం.: 0863- 2230527, 2337471
ఇ మెయిల్ : bom411@mahabank.co.in, brmgr411@mahabank.co.in

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 3(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (సర్ఫాసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరుశాఖలో సర్ఫాసీ చట్టం యొక్క సెక్షన్13(2) క్రింద పేర్కొన్న తేదీలలో బ్యాంక్ నోటీసు జారీ చేసి క్రింది రుణగ్రహీత ఖాతాలు ఎన్‌పిఎగా వర్గీకరించబడ్డాయి. సంబంధిత అందరి సమాచారం కొరకు ఈ పబ్లిక్ నోటీసు ప్రచురించబడుతోంది. డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు అమలు చేయబడిన లోన్/ ఇతర ఒప్పందాలు మరియు పత్రాలు సంబంధిత వ్యక్తుల ద్వారా క్రింద చెల్లింపు తేదీ వరకు దిగువ సూచించిన మొత్తాన్ని ఒప్పంద రేట్లలో భవిష్యత్తు వడ్డీతో క్రింద పేర్కొన్న రుణగ్రహీత/ హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర గుంటూరు శాఖకు చెల్లించవలసి ఉంటుంది. పేర్కొన్న ఒప్పందాలు మరియు పత్రాల ప్రకారం రుణగ్రహీతల బాధ్యతకు భద్రతగా, సంబంధిత ఆస్తులు పేర్లకు వ్యతిరేకంగా చూపించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖకు ఛార్జ్ చేయబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీతలు మరియు హామీదారుల పేరు మరియు చిరునామా/శాఖ	బకాయి మొత్తం (28.04.2025 నాటికి)	
1	శాఖ : గుంటూరు **1. మెసెర్స్.ఎస్.జి. ఇండస్ట్రీస్, ప్రొప్రైటర్. శ్రీ. బిరుదు బాబూరావు,** ప్లాట్ నం.247 బి, 318 మరియు 319, అన్నంగి గ్రామం, గ్రోత్ సెంటర్, గుడ్లపల్లి, ఒంగోలు-523211. **2. శ్రీ.బిరుదు గౌతం (హామీదారు/ తనఖాదారు),** డో.నం.26-41-106సి, 4వ లైన్, లాస్ట్ ఎ టి అగ్రహారం, గుంటూరు-522004. **3. శ్రీ. బిరుదు బాబూరావు (హామీదారు/ తనఖాదారు),** డో.నం.26-41-106సి, 4వ లైన్, లాస్ట్ ఎ టి అగ్రహారం, గుంటూరు-522 004.	**రూ.1,71,02,053/-** (ఒక కోటీ డెభై ఒక్క లక్షల రెండు వేల యాభై మూడు రూపాయలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ/ **29.04.2025** నుండి వర్తించే రేటు ప్రకారం భవిషత్తు వడ్డీ ప్లస్ ఖర్చు మరియు ఇతర ఖర్చులు మొదలైనవి.	
	టిఎల్ : రూ.162.00 లక్షలు (ఒక కోటీ అరవై రెండు లక్షలు మాత్రమే) మరియు క్యాష్ క్రెడిట్ : రూ.25.00 లక్షలు (ఇరవై ఐదు లక్షలు మాత్రమే)	**డిమాండ్ నోటీసు తేది : 28.04.2025**	**ఎన్‌పిఎ తేది : 31.03.2025**

ప్రాథమిక సెక్యూరిటీ : ప్లాంట్ మరియు మిషనరీ మరియు కమర్షియల్ ఆస్తి తనఖాకు సమానమైన హైపోథికేషన్.
అనుషంగిక సెక్యూరిటీ : స్థిరాస్తులకు సమానమైన తనఖా
(ఎ) కార్యనిర్వాహకుల పేరు : శ్రీ. బిరుదు బాబూరావు, (బి) ఛార్జ్ విధానం : తనఖాకు సమానం
సెక్యూరిటీ వివరణ : ఎస్ఆర్ఓ గుంటూరు, నల్లపాడు ఉపజిల్లా, అంకిరెడ్డి పాలెం గ్రామం యొక్క డో.నం.614 కలిగి ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్కలు మరియు పార్శిళ్లు ప్లాట్ నం.11 పశ్చిమం వైపు విస్తీర్ణం 216 చ.గ.లు. లేదా 180.59 చ.మీ.లు. క్రింది విధంగా ఉన్న హద్దులు : ఉత్తరం : 40' వెడల్పు రోడ్డు 33'.9", దక్షిణం : ఇతరుల సైట్ 33'.9", తూర్పు : ప్లాట్ నం.11 తూర్పు వైపు సైట్- 57'.3", పడమర : ప్లాట్ నం.12 సైట్ 58'. తో కలిపి రెసిడెన్షియల్/ కమర్షియల్ స్థలం కొలత 180.59 చ.మీ.లు. లేదా 216 చ.గ.లు. మరియు అనుబంధ లిస్ట్ ప్రకారం దానిపై అన్నీ అనుబంధ ఫిక్చర్లు (సిఇఆర్ఎస్ఎఐ ఐడి : 200077568804)
ఎస్ఆర్ఓ గుంటూరు, నల్లపాడు ఉపజిల్లా, అంకిరెడ్డిపాలెం గ్రామం యొక్క డో.నం.75 కలిగి ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ పరిధి 384 చ.గ.లు. లేదా 321.06 చ.మీ.లు. క్రింది విధమైన హద్దులు : ఉత్తరం ం ప్లాట్ నం.62 సైట్-70', దక్షిణం : ప్లాట్ నం.60 సైట్- 70', తూర్పు : 40 వెడల్పు రోడ్డు 47'-9", పడమర : ఇతరుల సైట్ 51' తో కలిపి రెసిడెన్షియల్/ కమర్షియల్ స్థలం కొలత 321.06 చ.మీ.లు. లేదా 384 చ.గ.లు. మరియు అనుబంధ లిస్ట్ ప్రకారం దానిపై అన్నీ అనుబంధ ఫిక్చర్లు (సిఇఆర్ఎస్ఎఐ ఐడి : 200077483147)
(బి) కార్యనిర్వాహకుల పేరు : శ్రీ. బిరుదు గౌతం, (బి) ఛార్జ్ విధానం : తనఖాకు సమానం
(ఎ) సెక్యూరిటీ వివరణ : ఎస్ఆర్ఓ నరసరావుపేట, సత్తెనపల్లి మండలం, కంకిపాడు గ్రామంలో ప్లాట్ నం.1, డో.నం.83/2బి, 83/2ఎ, 83/2బి1 కలిగి ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్కలు మరియు పార్శిళ్లు విస్తీర్ణం 604.44 చ.గ.లు. లేదా 507.72 చ.మీ.లు. క్రింది విధంగా ఉన్న హద్దులు : ఉత్తరం : 17' వెడల్పు రోడ్డు 40', దక్షిణం : సత్తెనపల్లి నుండి గుంటూరు రోడ్డు 40', తూర్పు : ప్లాట్ నం.2 సైట్ 136', పడమర : 40' వెడల్పు రోడ్డు 136'. తో కలిపి రెసిడెన్షియల్/ కమర్షియల్ స్థలం కొలత 507.72 చ.మీ.లు. లేదా 604.44 చ.గ.లు. మరియు అనుబంధ లిస్ట్ ప్రకారం దానిపై అన్నీ అనుబంధ ఫిక్చర్లు (సిఇఆర్ఎస్ఎఐ ఐడి : 200077575680)
(ఎ) సెక్యూరిటీ వివరణ : ఎస్ఆర్ఓ నరసరావుపేట, సత్తెనపల్లి మండలం, కంకిపాడు గ్రామంలో ప్లాట్ నం.12 మరియు ఉత్తరం వైపు ప్లాట్ నం.11 మరియు 13, డో.నం.83/బిఎ, 83/2బి1, 83/2బి1, 83/2బి1 కలిగి ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ పరిధి 405.55 చ.గ.లు. లేదా 340.66 చ.మీ.లు. క్రింది విధంగా ఉన్న హద్దులు : ఉత్తరం : ఎస్.ఎ.ఎస్.సి. సైట్ 75', దక్షిణం : వర్ల రోడ్డు, తూర్పు : ప్లాట్ నం.11 మరియు 13 దక్షిణం వైపు, పడమర : 40' వెడల్పు రోడ్డు. తో కలిపి రెసిడెన్షియల్/ కమర్షియల్ స్థలం కొలత 340.66 చ.మీ.లు. లేదా 405.55 చ.గ.లు. మరియు అనుబంధ లిస్ట్ ప్రకారం దానిపై అన్నీ అనుబంధ ఫిక్చర్లు (సిఇఆర్ఎస్ఎఐ ఐడి : 200077585377)
(డి) కార్యనిర్వాహకుల పేరు : మెసెర్స్. ఎస్.జి. ఇండస్ట్రీస్, (ప్రొప్రైటర్. బిరుదు బాబూరావు ద్వారా ప్రాతినిధ్యం), (ఇ) ఛార్జ్ విధానం : తనఖాకు సమానం. (ఎఫ్) సెక్యూరిటీ వివరణ : ప్రకాశం రిజిస్ట్రేషన్ జిల్లా, ఒంగోలు ఉపజిల్లా, మద్దిపాడు మండలం, అన్నంగి గ్రామం, గ్రోత్ సెంటర్, గుడ్లపల్లి (గ్రామం వద్ద వేయబడిన మరియు ఉన్న రెసిడెన్షియల్ ఖాళీ సైట్ మొత్తం ఆ ముక్కలు మరియు పార్శిల్లు డో.నం.318 మరియు 319, ఆ ప్లాట్ నం.247బి విస్తీర్ణం 2024.53 చ.గ.లు. లేదా 1692.75 చ.మీ.లు. క్రింది విధంగా ఉన్న హద్దులు : ఉత్తరం : ప్లాట్ నం.547-బి, తూర్పు : 20 మీ.లు. వెడల్పు రోడ్డు మరియు 132 కెవి పవర్ లైన్, దక్షిణం : ప్లాట్ నం.547-ఎ, పడమర : ప్లాట్ నం.546. తో కలిపి రెసిడెన్షియల్/ కమర్షియల్ స్థలం కొలత 1692.75 చ.మీ.లు. లేదా 2024.53 చ.గ.లు. మరియు అనుబంధ లిస్ట్ ప్రకారం దానిపై అన్నీ అనుబంధ ఫిక్చర్లు (సిఇఆర్ఎస్ఎఐ ఐడి : 200077473296)

సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖకు చెల్లింపు చేయడంలో విఫలమైతే, చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించే నిబంధనల ప్రకారం పూర్తిగా సంబంధిత రుణగ్రహీతలు/హామీదారుల నష్టాలకు సంబంధించి పైన పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌కు వ్యతిరేకంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ కొనసాగడానికి అర్హత కలిగి ఉంటుంది. సర్ఫేసీ యాక్ట్ యొక్క నిబంధనల ప్రకారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ శాఖ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా సంబంధిత రుణగ్రహీతలు / హామీదారులు పైన పేర్కొన్న ఆస్తులను ఏ పద్ధతిలోనైనా, ఖర్చులు మరియు పరిణామాలు, అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయకుండా నిషేధించబడ్డారు, పేర్కొన్న నిబంధనలకు ఏదైనా ఉల్లంఘన జరిగితే సర్ఫేసీ యాక్ట్ ప్రకారం సంబంధిత వ్యక్తులు శిక్ష మరియు/ లేదా పెనాల్టీకి బాధ్యత వహించగలరు. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది. మరిన్ని వివరాలకు దిగువసంతకందారు నుండి సర్వ్ చేయబడని తిరిగివచ్చిన నోటీసులను సేకరించవచ్చును. ఈ నోటీసు కూడా ప్రచురితమవుతుంది.

తేది : 03.05.2025
ప్రదేశం : విజయవాడ
సం/- చీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ

వర్ష బీభత్సం

ప్రజాశక్తి- యంత్రాంగం

అల్లూరి, అనకాపల్లి, శ్రీసత్యసాయి జిల్లాల్లో శనివారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వర్ష బీభత్సానికి పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శ్రీసత్యసాయి జిల్లాలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో రెండు గంటలపాటు ఏకధాటిగా కుండపోత వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. అరకులోయ సహా పలు ప్రాంతాల్లో వానకు గాలి తోడైంది. రాజవొమ్మంగిలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎంపిడిఒ కార్యాలయం సమీపంలోని భారీ మామిడి చెట్టు పడి వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం దెబ్బతింది. కొయ్యూరు మండలం కొమ్మిక పంచాయతీ కొత్త బొర్రంపేటలో ఈదురుగాలులకు ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో భారీ వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. నక్కపల్లిలో మోటమర్రి సత్రం వద్ద చెట్టు విరిగి షాపులపై పడింది. వైసిపి కార్యాలయంతోపాటు అక్కడ ఉన్న పలు దుకాణాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రాజయ్యపేటలో విద్యుత్ స్తంభం, కొబ్బరి చెట్టు విరిగిపోయాయి.

మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు, పాడేరు వెళ్లే ప్రధాన రహదారిలో చెట్లు పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శ్రీ సత్యసాయి జిల్లాలో వర్షం కన్నా విపరీతమైన ఈదురు గాలుల వల్ల ఎక్కువ నష్టం జరిగింది. బుక్కపట్నం, నల్లమాడ, ధర్మవరం, కదిరి మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. 22 ఎకరాల్లో అరటి చెట్లు నేలకు ఒరిగినట్లు అధికారులు తెలిపారు.

పెరుగుతున్న మహిళల రుణాలు

- నీతిఅయోగ్ తాజా నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వివిధ కారణాలతో బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుంటున్న మహిళల సంఖ్య దేశ వ్యాప్తంగా పెరుగుతోంది. నీతి అయోగ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని పేర్కొంది. 2019వ సంవత్సరం నుండి మహిళలు తీసుకుంటున్న రుణాలు అన్ని విభాగాల్లోనూ పెరుగుతున్నట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. ఆస్తిని తాకట్టుపెట్టి తీసుకునే రుణాలు 36 శాతంగా ఉండగా, ఇందులో రెండు శాతం పెరుగుదల ఉన్నట్లు గుర్తించారు. అలాగే వ్యవసాయానికి తీసుకునే రుణాలు 2019 నుంచి 26 శాతానికి చేరుకోగా, ఈ రంగంలో కూడా ఐదు శాతం పెరుగుదల కనిపించడం విశేషం. ఇక వ్యాపారాల కోసం తీసుకునే రుణాలు 25 శాతంగా ఉండగా, రెండుశాతం పెరుగుదల నమోదైంది. ఇక సొంత వాహనాల కోసం తీసుకునే రుణాలు కూడా 19 శాతంగా ఉండగా, ఇది గతం కన్నా నాలుగు శాతం ఎక్కువగా ఉండడం గమనార్హం.

2.22 లక్షల కోట్లు రుణం

2023-24 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు 2.22 లక్షల కోట్లు రుణాలుగా ఇచ్చినట్లు తేలింది. రుణాలు తీసుకున్న మహిళలు 4.24 కోట్ల మందిగా నివేదికలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో కూడా భారీ సంఖ్యలోనే మహిళల నుంచి రుణాలకు దరఖాస్తులు వస్తున్నట్లు తేలింది. మొత్తం మహిళలు తీసుకుంటున్న రుణాల్లో వ్యాపారం కోసం మూడు శాతం మంది ఉండగా, బంగారంపై 36 శాతం, వ్యక్తిగత రుణాల కింద 42 శాతం ఉన్నట్లు తేలింది. రుణాలు తీసుకుంటున్న వారిలో 30 ఏళ్లలోపు వారిలో వ్యకిగత అవసరాలకు 42 శాతం మంది రుణాలు తీసుకోగా, బంగారంపై 17 శాతం, వ్యాపారాల నిమిత్తం 18 శాతం మంది రుణాలు తీసుకోగా, వ్యవసాయ రంగానికి 13 శాతం మంది రుణాలు తీసుకున్నట్లు తేలింది. సెమీ అర్బన్, గ్రామాల్లో రుణాలు తీసుకునే వారి సంఖ్య భారీగా పెరిగినట్లు గుర్తించారు. ఈ విభాగంలో 49 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకోగా, వ్యాపారం కోసం రుణాలు తీసుకున్న వారి శాతం 65 శాతంగా, వ్యవసాయం కోసం రుణాలు తీసుకున్న వారి శాతం 84గా ఉండడం గమనార్హం.

30 ఏళ్లలోపు వారిలో

వ్యక్తిగత రుణం	42 శాతం
బంగారంపై	17 శాతం
వ్యాపారంపై	18 శాతం
వ్యవసాయానికి	13 శాతం
మొత్తం మహిళల రుణాలు	
వ్యాపారానికి	3 శాతం
బంగారంపై	36 శాతం
వ్యక్తిగతానికి	42 శాతం
సెమీఅర్బన్, గ్రామాల్లో	
వ్యక్తిగత రుణం	49 శాతం
బంగారంపై	70 శాతం
వ్యాపారానికి	65 శాతం
వ్యవసాయానికి	84 శాతం

వెయ్యికి ఎకరా!

- టిడిపి కార్యాలయానికి రెండెకరాలు కేటాయింపు
- 33 ఏళ్ల పాటు లీజు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయానికి రెండెకరాల భూమిని కేటాయించి టిడిపి కూటమి ప్రభుత్వంపై తనకున్న అభిమానాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ చాటుకున్నారు. తుమ్మపాల సర్వే నెంబర్ 608/10లో కోట్ల విలువైన పోరంబోకు భూమి రెండెకరాలను ఏడాదికి ఎకరా వెయ్యి రూపాయల చొప్పున 33 సంవత్సరాలకు లీజుకు ఇస్తూ గత నెల 28న ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రివర్గ ఆమోదానికి పెడితే వివాదాస్పదమవుతుందని అడ్డదారిలో టిడిపి ఈ స్థలం పొందింది. జిల్లాలో టిడిపి కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీ మెప్పు పొందడానికి కలెక్టర్ రెండెకరాలు బహుమతిగా ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిగా తాము చెప్పినట్లు వింటున్న కలెక్టర్ విజయకృష్ణన్ భర్త అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న దినేష్‌కుమార్‌ను జివిఎంసి కమిషనర్‌గా తీసుకురానున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు 2024 జులై 22న చేసిన దరఖాస్తును అనుసరించి రెండెకరాలు కేటాయించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



ప్రపంచ సాహితీ సంబరాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన ఏలూరు జిల్లా కేంద్రమైన ఏలూరులోని మహాలక్ష్మి గోపాలస్వామి కళ్యాణ మండపంలో ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న ప్రపంచ సాహితీ సంబరాలను విజయవంతం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. విజయవాడలోని హోటల్ ఐలాపురంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సిఇఒ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ ప్రధాన కార్యదర్శి టి పార్థసారధితో కలిసి ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. సాహితీ చరిత్రలో ప్రభంజనం సృష్టిస్తూ 148వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, ఎపి ఎన్ఆర్‌టిసిఎస్ మాజీ డైరెక్టర్, టిడిపి ఎన్ఆర్ఐ సెల్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గాజాలో ఆకలి కేకలతో
57 మంది మృత్యువాత

గాజా : గాజా స్ట్రిప్‌లో శనివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడిలో 30 మంది పాలస్తీనియన్లు మరణించారని వైద్య వర్గాలు తెలిపాయి. దాడుల్లో చనిపోవడమే కాదు, ఆకలికి తట్టుకోలేక కూడా చాలా మంది మృతి చెందుతున్నారు. వారిలో చిన్నారులే ఎక్కువ సంఖ్యలో వుంటున్నారు. తాజాగా గాజా నగరానికి పశ్చిమాన ఉన్న రాంటీస్ ఆసుపత్రిలో సకాఫీ అనే ఒక బాలిక మృతి చెందినట్లు మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు ఆకలితో మరణించిన వారి సంఖ్య 57కి చేరిందని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం తెలిపింది. తక్షణమే సరిహద్దులను తెరిపించి, ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఖాన్ యూనిస్ శరణార్థ శిబిరంపై గత రాత్రి జరిగిన దాడిలో 11మంది చనిపోయారు. వీరిలో ఏడాది వయసులోపు వున్న ముగ్గురు శిశువులు కూడా వున్నారని గాజా పౌర రక్షణ దళం శనివారం తెలిపింది. శనివారం తెల్లవారు జామున 3గంటల సమయంలో జరిగిన ఈ దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిదిమంది మరణించారని పౌర రక్షణ దళం ప్రతినిధి మహ్మద్ బసల్ తెలిపారు. హమాస్ సభ్యుడిని లక్ష్యంగా చేసుకునే తాము దాడి జరిపామని ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम

గుంటూరు శాఖ : 4/14, 4వ లేన్, బ్రాడీపేట, గుంటూరు-522 002.
ఫోన్ నం.: 0863- 2230527, 2337471
ఇ మెయిల్ : bom411@mahabank.co.in, brmgr411@mahabank.co.in

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 3(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (సర్ఫాసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరుశాఖలో సర్ఫాసీ చట్టం యొక్క సెక్షన్13(2) క్రింద పేర్కొన్న తేదీలలో బ్యాంక్ నోటీసు జారీ చేసి క్రింది రుణగ్రహీత ఖాతాలు ఎన్‌పిఎగా వర్గీకరించబడ్డాయి. సంబంధిత అందరి సమాచారం కొరకు ఈ పబ్లిక్ నోటీసు ప్రచురించబడుతోంది. డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు అమలు చేయబడిన లోన్/ ఇతర ఒప్పందాలు మరియు పత్రాలు సంబంధిత వ్యక్తుల ద్వారా క్రింద చెల్లింపు తేదీ వరకు దిగువ సూచించిన మొత్తాన్ని ఒప్పంద రేట్లలో భవిష్యత్తు వడ్డీతో క్రింద పేర్కొన్న రుణగ్రహీత/ హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర గుంటూరు శాఖకు చెల్లించవలసి ఉంటుంది. పేర్కొన్న ఒప్పందాలు మరియు పత్రాల ప్రకారం రుణగ్రహీతల బాధ్యతకు భద్రతగా, సంబంధిత ఆస్తులు పేర్లకు వ్యతిరేకంగా చూపించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖకు ఛార్జ్ చేయబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీతలు మరియు హామీదారుల పేరు మరియు చిరునామా/శాఖ	బకాయి మొత్తం (28.04.2025 నాటికి)	
1	శాఖ : గుంటూరు **1. మెసెర్స్.జిప్‌కాన్ పేవర్ ఇండస్ట్రీస్, ప్రొప్రైటర్. శ్రీ. మాచవరపు ప్రేమకుమార్,** డో.నం.11-315/1, నున్న బైపాస్‌రోడ్డు, నున్న గ్రామం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-521212 **2. శ్రీ. మాచవరపు ప్రేమ కుమార్ (ప్రొప్రైటర్/ తనఖాదారు),** ఫ్లాట్ నం.502, కేశవ హైట్స్, పటమట, పంటకాలువ రోడ్డు వద్ద, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.	**రూ.83,51,275/-** (ఎనభై మూడు లక్షల యాభై ఒక్క వేల రెండు వందల డెభై ఐదు రూపాయలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ/ **29.04.2025** నుండి వర్తించే రేటు ప్రకారం భవిషత్తు వడ్డీ ప్లస్ ఖర్చు మరియు ఇతర ఖర్చులు మొదలైనవి.	
	టిఎల్ : రూ.28.00 లక్షలు (ఇరవై ఎనిమిది లక్షలు మాత్రమే) మరియు సిసి : రూ.60.00 లక్షలు (అరవై లక్షలు మాత్రమే)	**డిమాండ్ నోటీసు తేది : 29.04.2025**	**ఎన్‌పిఎ తేది : 31.03.2025**

ప్రాథమిక సెక్యూరిటీ : 1. స్టాక్ హైపోథికేషన్, 2. ప్లాంట్ మరియు మిషనరీ హైపోథికేషన్.
అనుషంగిక సెక్యూరిటీ : తనఖాకు సమానమైన ఆస్తి (సిఇఆర్ఎస్ఎఐ ఐడి : 200078354881)
ఆస్తి షెడ్యూల్ : పల్నాడు రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల ఉపజిల్లా, పిడుగురాళ్ల మున్సిపాలిటీ వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఖాళీ సైట్ మొత్తం ఆ ముక్కలు మరియు పార్శిళ్లు డో.నం.892/45-7ఇ, డో.నం.17-71 వద్ద విస్తీర్ణం 943.8 చ.గ.లు. లేదా 789.139 చ.మీ.లు. క్రింది విధంగా ఉన్న **హద్దులు : తూర్పు:** 20 లిం.లు. వెడల్పు బజారు, **దక్షిణం :** షేక్ జమాలుద్దీన్ ఆస్తి, **పడమర :** గంగిరెడ్డి సామ్రాజ్యం మరియు ఇతరుల స్థలం, **ఉత్తరం :** బజారు. తో కలిపి రెసిడెన్షియల్/ కమర్షియల్ స్థలం కొలత 943.80 చ.గ.లు. లేదా 789.139 చ.మీ.లు. మరియు అనుబంధ లిస్ట్ ప్రకారం దానిపై అన్నీ అనుబంధ ఫిక్చర్లు

సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖకు చెల్లింపు చేయడంలో విఫలమైతే, చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించే నిబంధనల ప్రకారం పూర్తిగా సంబంధిత రుణగ్రహీతలు/హామీదారుల నష్టాలకు సంబంధించి పైన పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌కు వ్యతిరేకంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ కొనసాగడానికి అర్హత కలిగి ఉంటుంది. సర్ఫేసీ యాక్ట్ యొక్క నిబంధనల ప్రకారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ శాఖ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా సంబంధిత రుణగ్రహీతలు / హామీదారులు పైన పేర్కొన్న ఆస్తులను ఏ పద్ధతిలోనైనా, ఖర్చులు మరియు పరిణామాలు, అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయకుండా నిషేధించబడ్డారు, పేర్కొన్న నిబంధనలకు ఏదైనా ఉల్లంఘన జరిగితే సర్ఫేసీ యాక్ట్ ప్రకారం సంబంధిత వ్యక్తులు శిక్ష మరియు/ లేదా పెనాల్టీకి బాధ్యత వహించగలరు. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది. మరిన్ని వివరాలకు దిగువసంతకందారు నుండి సర్వ్ చేయబడని తిరిగివచ్చిన నోటీసులను సేకరించవచ్చును. ఈ నోటీసు కూడా ప్రచురితమవుతుంది.

తేది : 03.05.2025
ప్రదేశం : విజయవాడ
సం/- చీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ

పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

Piramal Finance

CIN:L65910MH1984PLC032639

రిజిస్టర్డ్ ఆఫీసు: యూనిట్ నెం.601, 6వ అంతస్తు, పిరామల్ అమితి బిల్డింగ్, పిరామల్ అగస్త్యా కార్పొరేట్ పార్క్, కమాని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురుగా, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబయి-400070. టెలి: +91 22 3802 4000.

బ్రాంచ్ ఆఫీసు: డోర్ నెం.7-1-615, 616 & 617/ఎ, ఇంపెరియల్ టవర్స్, 4వ అంతస్తు, అమీర్‌పేట్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500016, తెలంగాణ.
సంప్రదించు వ్యక్తి: 1) రమణ రావు-98492 71633, 2) రోహన్ సావంత్-98331 43013

ఇ- వేలం అమ్మకపు ప్రకటన- తదుపరి అమ్మకం

రుణగ్రహీత/ల నుండి బకాయి మొత్తాల రికవరీ కొరకు **సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002** క్రింద పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే దిగువ పేర్కొన్న సెక్యూర్డు అసెట్ యొక్క స్వాధీనం చేసుకునేందుకు అనుగుణంగా స్వాధీనంలోని దిగువ వివరించినట్లుగా స్థిరాస్తి యొక్క కొనుగోలు కొరకు **"ఎక్కడ ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ప్రతిపాదికన"** క్రింది సంతకందారుడు ఆఫర్లను ఆహ్వానిస్తున్నారు, వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

లోన్ కోడ్/ బ్రాంచ్/ రుణగ్రహీత(ల) సహ-రుణగ్రహీత(ల)/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి వివరణ- ఫైనల్	రిజర్వు ధర	ధరావత్తు (ఈఎండి) (ఆర్‌పిలో 10%)	బాకీపడిన మొత్తం (02-05-2025)
లోన్ కోడ్ నెం: 02400005284, విజయవాడ (బ్రాంచ్) సురేష్ అసిలేటి (సహ-రుణగ్రహీత1)	తేదీ:18.01.2022 రూ. 15,44,763/- (రూ. పదిహేను లక్షల నలభైనాలుగు వేల ఏడువందల అరవై మూడు మాత్రమే)	ప్లాట్ నెం:68, రోడ్ నెం:2, ఫేజ్-2, డ్రీమ్ సిటీ, ఎల్.పి.నెం.11/2016, బి.జె.జె. విగ్రహం దగ్గర, విలేజ్ రోడ్, కొమరవోలు గ్రామం, పామరు మండలం, కృష్ణ ఆంధ్రప్రదేశ్:-521325 లోని విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం మరియు సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం:69, దక్షిణం: ప్లాట్ నెం:67, తూర్పు: 40 అ.ల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం:49.	రూ. 14,00,000/- (రూ. పద్నాలుగు లక్షలు మాత్రమే)	రూ. 1,40,000/- (రూ. ఒకలక్షా నలభై వేలు మాత్రమే)	రూ. 15,84,609/- (రూ.పదిహేను లక్షల ఎనభైనాలుగు వేల ఆరువందల తొమ్మిది మాత్రమే)
లోన్ కోడ్ నెం: 10600001266, గుంటూ (బ్రాంచ్), పెద్ద సుబ్బరాయయుడు మేకల (రుణగ్రహీత), లక్ష్మి మేకల (సహ-రుణగ్రహీత 1)	తేదీ.21.06.2022 రూ. 21,40,841/- (రూ. ఇరవైఒక లక్షల నలభైవేల ఎనిమిది వందల నలభై ఒకటి మాత్రమే)	సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ నెం.403, బ్లాక్- ఇ, శేషాద్రి బ్లాక్, 3వ అంతస్తు, డి.నెం: 579, 578/1ఎ, 568/1ఎ, 567, యుడిఎస్ 44.1/4 చ.గజాలు, తిరుమల గార్డెన్, గుంటూరు గ్రామం, గుంటూరు మున్సిపల్ పరిమితులు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522509లోని విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం మరియు సరిహద్దులు: ఉత్తరం: ఒపెన్ టు స్కై, దక్షిణం:ఒపెన్ టు స్కై,తూర్పు: నామ్మడి కారిడార్, పడమర: ఒపెన్ టు స్కై. సరిహద్దులు :ఉత్తరం:ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై, తూర్పు: నామ్మడి కారిడార్, పడమర: ఒపెన్ టు స్కై.	రూ. 14,40,000/- (రూ. పద్నాలుగు లక్షలు నలభై వేలు మాత్రమే)	రూ. 1,44,000/- (రూ. ఒకలక్షా నలభై నాలుగు వేలు మాత్రమే)	రూ. 34,39,102/- (రూ.ముప్పైనాలుగు లక్షల ముప్పైతొమ్మిది వేల ఒకవంద రెండు మాత్రమే)

ఇ-వేలం తేది: 27-05-2025, ఉ॥ 11.00గం.ల నుండి మ.1.00గం.ల వరకు (ప్రతి 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో),
బిడ్ దాఖలుచేయుటకు చివరి తేది: 26-05-2025, సా.4.00 గం.లకు ముందు.
అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి, www.piramalfinance.com/e-Auction.html లో కల్పించిన లింక్‌ను చూడండి లేదా piramal.auction@piramal.com ద్వారా మాకు ఇమెయిల్ చేయండి.

రుణగ్రహీత/హామీదారు/తాకట్టుదారుకు SARFAESI చట్టం క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకపు ప్రకటన
వేలం తేదీకి ముందు తేదీ వరకు వర్తించు వడ్డీతోసహా పూర్తిగా సెక్షన్13(2) నోటీసులో పేర్కొన్నట్లుగా పూర్తి బకాయిని చెల్లించవలసిందిగా పై పేర్కొన్న రుణగ్రహీత/హామీదారును కోరబడుచున్నది, విఫలం చెందిన ఏడైతే, ఆస్తి వేలంచేయబడుతుంది మరియు మిగతా బకాయిల కొరకు రుణగ్రహీత / హామీదారు నుండి వడ్డీ& ఖర్చులు ఏవేని ఉన్నట్లైతే వారి నుండే వసూలు చేయబడుతుంది.

తేది: 04 మే, 2025, ప్రదేశం: క్రిష్ణా, గుంటూరు
సం/- (అధీకృత అధికారి), పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HEMADRI CEMENTS LIMITED

Address: Vedadri Village, Jaggaiahpetv Mandal, Krishna Dist (A.P) - 521 457.

Statement of Audited Financial Results for the year ended 31-03-2025 pursuant to Regulation 33 of SEBI (LODR) Regulations, 2015, CIN : L26942AP1981PLC002995

(Rupees in Lakhs unless otherwise stated)

S.No.	Particulars	Three Months' Ended			Year Ended	
		31.3.2025	31.12.2024	31.03.2024	31.03.2025	31.03.2024
		UnAudited	UnAudited	UnAudited	Audited	Audited
1	**Revenue from Operations**	-	-	1,436.22	794.62	5,585.93
2	Other Operating Income	-		-	-	-
3	Other Income	-	21.19	21.41	111.40	100.31
	Total Income	-	**21.19**	**1,457.63**	**906.02**	**5,686.24**
	Expenses					
4	a) Cost of Material consumed	-	-	268.84	189.88	1,258.02
	b) Purchase of Stock-in-Trade	-	-	-	-	-
	c) Changes in inventories of finished goods,work-in-progress and stock-in-trade	-	-	(167.90)	97.57	(346.72)
	d) Power and Fuel	-	103.55	659.40	750.67	3,461.64
	e) Employee benefits expenses	-	115.29	185.16	508.64	586.97
	f) Finance costs	-	4.61	42.21	137.87	139.10
	g) Depreciation & amortisation expense	-	38.89	47.88	159.55	188.19
	h) Other Expenses	-	74.71	861.03	1,183.55	1,680.53
	Total Expenses	-	**337.05**	**1,896.62**	**3,027.73**	**6,967.73**
5	Profit Before Tax & Exceptional Items(3-4)	-	**(315.86)**	**(438.99)**	**(2,121.71)**	**(1,281.49)**
6	Exceptional items					
7	**Profit Before Tax (5-6)**	-	**(315.86)**	**(438.99)**	**(2,121.71)**	**(1,281.49)**
8	**Tax Expense**					
	Current Tax	-	-	-	-	-
	MAT credit	-		-	-	-
	Deferred Tax	-	-	**(188.32)**	**584.20**	**(188.32)**
	Excess Provision reversed	-	-	-	-	-
	Net Tax Expense / (Benefit)	-	-	**(188.32)**	**584.20**	**(188.32)**
9	Net Profit / (Loss) for the period	-	**(315.86)**	**(250.67)**	**(2,705.91)**	**(1,093.17)**
10	**Other Comprehensive Income**					
	(i) Items that will not be reclassified to Profit & Loss	-	-	**(35.32)**	**22.71**	**(35.32)**
	ii) Income tax on above	-	-	**(9.18)**	-	**(9.18)**
	Other Comprehensive Income	-	-	**(26.14)**	**22.71**	**(26.13)**
11	**Total Comprehensive Income (Comprising Profit & Other Comprehensive Income) (9+10)**	-	**(315.86)**	**(276.81)**	**(2,683.20)**	**(1,119.30)**
	PAID UP CAPITAL (66,70,000 nos's of equity share of Rs 10/- each)	**667.00**	**667.00**	**667.00**	**667.00**	**667.00**
12	**Earnings Per Share**					
	(a) Basic Rs.	-	(4.74)	(3.76)	(40.57)	(16.39)
	(b) Diluted Rs.	-	(4.74)	(3.76)	(40.57)	(16.39)

Notes:
1. The Company's business operations comprises of a single segment viz., cement and materials.
2. The Above Statement has been prepared to the extent applicable, in accordance with the Companies (Indian Accounting Standards) Rules, 2015 prescribed under Section 133 of the Companies Act, 2013 and Other recognised Accounting Practices and Policies adopted by the Company w.e.f 01.04.2018.
3. The above Audited Results were reviewed by the Audit Committee and approved by the Board of Directors at their meeting held on 03.05.2025.
4. The Company has been incurring continuous losses since the financial year 2022–23, and its net worth has been fully eroded as at 31st March 2025. To support its operations and meet funding requirements, the Company by the approval of shareholders through EGM has borrowed Rs.1,927.71 lakhs from its group companies during the current financial year. In August 2024, the Company temporarily suspended its manufacturing operations due to adverse market conditions and a significant increase in production costs. Management is currently evaluating various strategic and operational measures, including enhancing production capacity and reducing operating costs, with the assistance of external consultants. The Company is also closely monitoring market developments and intends to resume operations once conditions are favourable.
5. Previous period numbers have been regrouped wherever necessary.
6. The above is an extract of the detailed format of the Quarterly Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly Financial Results are available on the Stock Exchanges website [www.bseindia.com], and company's website [www.hemadricements.com]. The same can be accessed by scanning the QR code provided below

Place : Chennai
Date : 03-05-2025

For Hemadri Cements Limited
Sd/-
Dr. Sivasamy Raju
Director
DIN:06961330



అరుణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి మధు, నేతలు

అరుణకు తుదివీడ్కోలు

- సిపిఎం ఎపి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, జాన్‌వెస్లీ సహా పలువురి నివాళి
- హైదరాబాద్‌లో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సీనియర్ నాయకురాలు సి అరుణ అంత్యక్రియలు శనివారం హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో ముగిశాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎపి మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శివర్గ సభ్యులు ఎవి నాగేశ్వరావు, రాంభూపాల్, నాయకులు నరసింహారావు, ఐద్వా ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి పి స్వరూపరాణి, కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి, సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి కార్యదర్శి, నవతెలంగాణ సిపిఎం పి ప్రభాకర్, ఎస్‌కె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. అంతకుముందు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఆమె భౌతికకాయానికి వి శ్రీనివాసరావు, ఐద్వా తెలంగాణ అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు పద్మ, కార్యదర్శి వరలక్ష్మి, సహాయ కార్యదర్శి షాబానాబేగం, విమల, భవాని, లక్ష్మి, వెంకటమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు. అరుణ భర్త సాంబిరెడ్డి, కుమారుడు అంజిరెడ్డిలతోపాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. శనివారం ఉదయం 9.30 గంటలకు అరుణ అంతిమయాత్ర ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు ముగిశాయి.

ఆస్ట్రేలియా ఎన్నికల్లో లేబర్ పార్టీ విజయం

- రెండోసారి ప్రధాని పదవి చేపట్టనున్న అల్బనీస్



కాన్‌బెర్రా : ఆస్ట్రేలియా సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌కి చెందిన పాలక మధ్యే వామపక్ష లేబర్ పార్టీ విజయం సాధించింది. దీంతో ప్రధాని ఆంథోని అల్బనీస్ వరుసగా రెండోసారి ప్రధాని పదవి చేపట్టనున్నారు. ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో సిడ్నీలో మద్దతుదారులను ఉద్దేశించి అల్బనీస్ శనివారం విజయోత్సవ ప్రసంగం చేశారు. ఆస్ట్రేలియన్లు మెజారిటీ లేబర్ ప్రభుత్వాన్ని ఎంపిక చేసుకున్నారని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా తీవ్ర అనిశ్చితులు నెలకొన్న వేళ.. ఆస్ట్రేలియన్లు ఆశావాదంతో ప్రతిస్పందించారని అన్నారు. ప్రతిపక్ష నేత పీటర్ డట్టన్ తన ఓటమిని అంగీకరించారు. 150సీట్లు కలిగిన ప్రతినిధుల సభలో పాలక సెంటర్ లెఫ్ట్ లేబర్ పార్టీకి 82సీట్లు వస్తాయని ఆస్ట్రేలియా ఎన్నికల కమిషన్ అంచనా వేసింది. ఇప్పటివరకు 85.5శాతం ఓట్లు లెక్కింపు పూర్తయింది. ప్రతిపక్ష కన్జర్వేటివ్ సంకీర్ణానికి 37సీట్లు వస్తాయని పేర్కొంది. మైనర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు కలిపి 13సీట్లు గెలుచుకునే అవకాశం వున్నట్లు కనిపిస్తోందని కమిషన్ పేర్కొంది.

అల్బనీస్‌కు ప్రధాని మోడీ అభినందనలు

వరుసగా రెండోసారి ఆస్ట్రేలియా ప్రధానిగా ఎన్నికైన ఆంథోనీ అల్బనీస్‌కు భారత ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. అల్బనీస్ నేతృత్వంలో భారత్, ఆస్ట్రేలియా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత ముందుకు తీసుకెళ్లగలమని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రిటన్, అమెరికా సహా పలు దేశాలకు చెందిన నేతలు అల్బనీస్‌కు అభినందనలు తెలియజేశారు.

తెలంగాణాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సు, ప్రయివేట్ బస్సు ఢీకొని 30 మందికి తీవ్ర గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం

మహేశ్వరం : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు గేట్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో సుమారు 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ చెందిన కొందరు ప్రయివేటు బస్సులో సోమశిల గుడికి వెళ్లి తిరిగి హైదరాబాద్‌కి వస్తున్నారు. కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తోంది. తుమ్మలూరు గేట్ వద్ద ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరితోపాటు 30 మందికి పైగా గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ప్రమాదం సమయంలో రెండు బస్సుల్లో సుమారు వంద మందికి పైగా ఉన్నారు. హైదరాబాద్-శ్రీశైలం హైవేపైన ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామయింది. సుమారు 4 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదానికి గల కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కుల గణన ఎప్పటికి పూర్తి చేస్తారు?

- ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లకు చట్టం చేయాలి
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కుల గణన ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా డిమాండ్ చేశారు. శనివారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనను సిపిఐ మొదటి నుంచి డిమాండ్ చేస్తుందని, తెలంగాణలో కుల గణనను సిపిఐ సమర్థించిందని అన్నారు. రిజర్వేషన్ ఫలాలు అర్హులకు అందాలంటే జనగణనలో కుల గణన అవసరమని అన్నారు. జనగణన నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉందని, కుల గణన ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. దానికి అనుగుణంగా విధాన పరమైన నిర్ణయాలు ఎప్పుడు తీసుకుంటారనే దానిపై కేంద్రం సమాధానం చెప్పాలన్నారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని కేంద్రం తొలగించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం ప్రైవేట్ పరం చేస్తుందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తుందని విమర్శించారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించడానికి కేంద్రం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడిని సిపిఐ ఖండిస్తోందని, బాధిత కుటుంబాలకు కేంద్రం న్యాయం చేయాలన్నారు. నిఘా, భద్రతా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు ఇచ్చిన ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ మద్దతు ఇస్తోందని అన్నారు. చర్చలతో పాక్, చైనా, భారత్ సమస్యలు పరిష్కరించుకోవాలని, పక్కపక్క దేశాలు గొడవలు పడటం సరికాదని సూచించారు.

ప్రజల ఆశలను మోడీ నీరుగార్చారు : రామకృష్ణ

రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభించిన ప్రధాని మోడీ.. ప్రజల ఆశలను నీరుగార్చారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. 2015లో ఇలానే వచ్చి మట్టి, నీరు ఇచ్చారని, ఇప్పుడు కూడా ఎలాంటి ఆర్థిక సహకారం ప్రకటించలేదని పేర్కొన్నారు. గ్రాంట్ ఇస్తామని ప్రకటించి, అప్పులు తెస్తున్నారని విమర్శించారు. అమరావతికి కేంద్రం నుంచి నిధుల విషయంలో అన్ని పార్టీలను కలుపుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లాలని సూచించారు. వెనుకబడిన జిల్లాలకు ఇస్తామన్న నిధులు ఇవ్వలేదని అన్నారు.


సిపిఎం అఖిల భారత మహాసభ అనంతరం తొలిసారి సమావేశమైన పొలిట్‌బ్యూరో. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నిబద్ధతతో ప్రాంతీయ, జాతుల సమస్యల పరిష్కారం: దిసనాయకే

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

శ్రీలంకలో ఉన్న అన్ని ప్రాంతీయ, జాతి సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని శ్రీలంక అధ్యక్షుడు, జెవిపి నాయకుడు అనుర కుమార దిసనాయకే పునరుద్ఘాటించారు. కొలంబోలోని జెవిపి ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి టిల్విన్ సిల్వా, పార్లమెంట్ స్పీకర్ జగత్ విక్రమరత్న, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎఆర్ సింధుతో పాటు ఇండియా వామపక్ష నేతలతో ఆయన భేటీ అయ్యారు. తమిళ, ముస్లిం జనాభా సమస్యల పట్ల జెవిపి, ఎన్‌పిపి వైఖరి మారిందని తెలిపారు. ఆర్థిక, ఇతర పరిమితుల మధ్య ప్రజల అంచనాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పరస్పర సహకారంతో దక్షిణాసియాలో వామపక్షాల బలోపేతానికి తమ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. కేరళను సందర్శించి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ పాలనానుభవాన్ని తెలుసుకోవాలనుందన్న ఆసక్తిని వెలిబుచ్చారు. జెవిపి ప్రధాన కార్యదర్శి టిల్విన్ సిల్వా ఎన్‌పీపీ ప్రభుత్వం ముందున్న సవాళ్లను, రాజకీయ, ఆర్థిక స్థిరత్వాన్ని వివరించారు. జెవిపి ఆహ్వానం మేరకు ఇండియాకు చెందిన వామపక్ష పార్టీల నేతలు ఎఆర్ సింధు సిపిఎం, బినయ్ విశ్వం (సిపిఐ), జి.దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్)లతో పాటు చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. మేడే రోజు శ్రీలంక రాజధాని కొలంబోలో నిర్వహించిన భారీ ర్యాలీలో దిసనాయకేతో పాటు నేతలంతా పాల్గొన్నారు.


అనుర కుమార దిసనాయకే, సింధూ

శ్రీలంక విజయం దక్షిణాసియా దేశాలకు ప్రేరణ : ఎఆర్ సింధు

ఈ సందర్భంగా ఎఆర్ సింధు మాట్లాడుతూ శ్రీలంకతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రమజీవులకు భారతదేశ కార్మికవర్గం, సిపిఎం తరపున విప్లవాత్మక శుభాకాంక్షలు తెలిపారు. మెరుగైన ప్రపంచం కోసం ధైర్యంగా పోరాడిన హేమార్కెట్ వీరులు సహా అసంఖ్యాక అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా గర్వంగా, గౌరవంగా గుర్తుచేసుకుంటున్నామన్నారు. శ్రీలంకలో వామపక్షాల విజయం కార్మిక వర్గ ఉద్యమానికి, వామపక్షాలకు, ముఖ్యంగా దక్షిణాసియా దేశాల వారికి ప్రేరణగా ఉన్నాయని వెల్లడించారు. జెవిపి, ఎన్‌పిపి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ఉంటుందని తాము విశ్వసిస్తున్నామన్నారు.

రాకేష్ టికాయత్‌పై మూక దాడి

- 'మోడీ.. మోడీ' అని నినాదాలు చేస్తూ తలపాగా విసిరేసిన సంఘ్ గూండాలు
- నిరసనగా మహా పంచాయత్
- భారీగా తరలివచ్చిన రైతులు
- ట్రాక్టర్ మార్చ్‌తో సమాధానం చెబుతాం : టికాయత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతు నాయకుడు రాకేష్ టికాయత్‌పై మూక దాడి జరిగింది. ఉత్తరప్రదేశ్ ముజఫర్‌నగర్‌లో ఒక బహిరంగ కార్యక్రమానికి హాజరైన టికాయత్‌పై సంఘపరివార్ గూండాలు దాడి చేశారు. పహల్గామ్‌లో ఉగ్ర దాడికి వ్యతిరేకంగా శుక్రవారం జరిగిన ఆక్రోశ్ ర్యాలీలో టికాయత్ పాల్గొన్నారు. ఉగ్రదాడిని నిరోధించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించడానికి, హిందూ-ముస్లిం ఐక్యత అవసరాన్ని నొక్కి చెప్పడానికి వేదికపైకి వచ్చిన టికాయత్‌పై అప్పటికే అక్కడే మాటువేసిన సంఘ్ సభ్యులు ఒక్కసారిగా చేరుకుని ఆయన తలపాగా విసిరేశారు. ఆయన కిందపడకుండా తృటిలో బయటపడ్డారు. బికెయు కార్యకర్తలు, పోలీసులు సభ నుంచి ఆయనను బయటకు తీసుకొచ్చారు. అయితే సంఘటనా స్థలంలో ఉన్న పోలీసులు చోద్యం చూడడం మినహా ఘటనను ఆపేందుకు ప్రయత్నించలేదు.


మహా పంచాయత్‌లో రైతులకు అభివాదం చేస్తున్న టికాయత్

ఉద్యమం బలహీనపడదు : రాకేష్ టికాయత్

రైతు ఉద్యమం బలహీనపడాలని కోరుకునే వారు దాడికి ప్రయత్నిస్తున్నారని రాకేష్ టికాయత్ విమర్శించారు. ఉద్యమం బలహీనపడదని, మనం కూడా బలహీనపడబోమని, మరింతగా బలోపేతమవుతామని అన్నారు. రైతుల గొంతు అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ట్రాక్టర్ మార్చ్ ద్వారా తగిన సమాధానం చెబుతామని ఎప్పారు. సంఘ్ దాష్టీకానికి నిరసనగా దాడి జరిగిన ముజ్‌ఫర్ నగర్‌లోనే శనివారం నిర్వహించిన కిసాన్ మహాపంచాయత్‌కు రైతులు పోటెత్తారు. సంఘ్ దాష్టీకాన్ని ముక్తకంఠంతో ఖండించారు. అదే సమయంలో రాకేష్ టికాయత్ కొద్దిసేపు స్పృహ కోల్పోగా, రైతు నేతలు అండగా నిలిచారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతోనే తనపై దాడికి తెగబడ్డారని విమర్శించారు. సభలో సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌ఎల్‌డి ఎంపిలు, ఎమ్మెల్యేలు సహ పలువురు నాయకులు పాల్గొన్నారు.

వెంటనే అరెస్టు చేయాలి : ఎస్‌కెఎం, ఎఐకెఎస్

రాకేష్ టికాయత్‌పై దాడిని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్రంగా ఖండించాయి. దాడికి పాల్పడిన వారందరినీ వెంటనే అరెస్టు చేయాలని, ఉత్తరప్రదేశ్‌లో ఆటవిక రాజ్యాన్ని అంతం చేయాలని డిమాండ్ చేశాయి. ఇది ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కూటమి దేశ వ్యతిరేక, నయా ఫాసిస్ట్ విధానాన్ని బహిర్గతం చేసిందని విమర్శించాయి. ఎస్‌కెఎం నాయకుడిపై జరిగిన దాడిని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖండించకపోవడం, నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నాయి. దేశ ప్రజల లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని కాపాడటానికి, ప్రజల ఐక్యతను బలోపేతం చేయడానికి గ్రామీణ, పట్టణ స్థాయిల్లో సమాజంలోని అన్ని వర్గాల సహకారంతో ప్రచారం నిర్వహిస్తామని ఎస్‌కెఎం పేర్కొంది.

భావ ప్రకటనా స్వేచ్ఛకు ప్రమాదకరం : ఎఐకెఎస్

రైతు నేత రాకేష్ టికాయత్‌పై దాడిని ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ ఖండించారు. దాడికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి, విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం చేసే వారందరికీ ప్రభుత్వం రక్షణ కల్పించాలని అన్నారు. రాజ్యాంగ హక్కులైన భావ ప్రకటనా స్వేచ్ఛ, శాంతియుత సమావేశాల నిర్వహణకు హిందూ మతతత్వ సంఘాలు ప్రమాదకరంగా మారాయని విమర్శించారు.

ఒమర్ అబ్దుల్లాతో ప్రధాని మోడీ భేటీ

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. పహల్గాం ఉగ్రదాడితోసహా అనేక విషయాలపై, జమ్ముకాశ్మీర్‌లో పరిస్థితిపై చర్చించారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు వెల్లడించారు. ప్రధానమంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశం దాదాపు 30 నిమిషాల పాటు కొనసాగినట్లు తెలిపారు.

మధ్యవర్తిత్వాలతోనే వివాదాల పరిష్కారం

- జాతీయ సదస్సులో రాష్ట్రపతి ఉద్ఘాటన

న్యూఢిల్లీ : మధ్యవర్తిత్వాల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడంపై దృష్టి పెట్టాల్సిందిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా కోరారు. తద్వారా దేశవ్యాప్తంగా న్యాయస్థానాలపై భారాన్ని తగ్గించాలని అన్నారు. మధ్యవర్తిత్వమనేది పరిస్థితులను సజావుగా వుండేలా చేస్తుందని, సౌకర్యవంతంగా వుండేందుకు దోహదపడుతుందని, న్యాయం కన్నా ఇది తక్కువేమీ కాదని, పైగా తెలివైన పనని వారు వ్యాఖ్యానించారు.

మీడియేషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఐఎ) శనివారం నిర్వహించిన మొదటి జాతీయ మధ్యవర్తిత్వ సదస్సులో రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. మధ్యవర్తిత్వమనేది భారతదేశంలో దీర్ఘకాలంగా నెలకొన్న సుసంపన్నమైన సాంప్రదాయమని వ్యాఖ్యానించారు.

వేసవి విడిది

శాస్త్రవేత్తను అవుతాను



అరటిపండు

అరటి పండు చూడు పసుపు రంగులో ఉండు
లోపల ఏమో తెలుపు రంగులో ఉండు
కోతులకు ఇష్టం అరటి పండు
అరటి తొక్క మీద కాలు వేస్తే జారి పడుదుము
అరటి పండు తింటే ఎముకలు బలము వచ్చు
అరటి చెట్టుకు కొమ్మలు ఉండవు
అరటి ఆకులో భోజనము ఆరోగ్యమును ఇచ్చు!



– ఎన్.వెంకట ప్రవీణ్,
5వ తరగతి, బుచ్చయ్యపల్లి,
పెద్దపల్లి జిల్లా.





హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు మద్దాల భారత్. 9వ తరగతి చదువుతున్నాను. మా నాన్న మల్లేశ్వరరావు వ్యవసాయం చేస్తారు. అమ్మ వెంకట లక్ష్మి గృహిణి. నాకు కొత్త కొత్త ఆవిష్కరణలు చేయడమంటే చాలా ఇష్టం. రాజమండ్రిలో మా బావ గారు నన్ను ఆ దిశగా ఎంతో ప్రోత్సహించారు. చెత్త నుంచి ఉపయోగకరమైన వస్తువులు ఎన్నో తయారు చేశాను. తక్కువ ఖర్చుతో ఎక్కువగా ఉపయోగపడే వస్తువులుగా ఎలక్ట్రిక్ మిక్సర్, కూలర్, టార్చ్ లైట్, ప్రొజెక్టర్, 3డి హెూలోగ్రామ్, ఫైర్ ఫైట్ రోబో సైన్స్ అనువర్తనలు ఉపయోగించి ప్రాజెక్ట్స్ చేశాను. వాహకతను ఉపయోగించి సింపుల్ సర్క్యూట్ బ్లేడ్ టచ్ ద్వారా నీరు రావడం, ఆగడం వంటి ప్రాజెక్ట్ తయారు చేసాను. ప్రస్తుతం ఇస్రో వారి యువిక ప్రోగ్రామ్‌కీ రాకెట్ మోడల్ ప్రపోజల్ సిద్ధం చేసాను. వేసవి సెలవులలో ఇస్రో వారి యువిక యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలి అనుకుంటున్నాను. ఏ.పి.జె అబ్దుల్ కలాం వలె శాస్త్రవేత్త అవ్వాలని కోరిక.



– మద్దాల భరత్ బాసు,
జెడ్.పి.పి.హైస్కూలు
గొంతినవానిపాలెం,
అల్లూరి సీతారామరాజు జిల్లా,
94410 00514.

బొమ్మల కొలువు





సింగిడి చైతన్య యోగ్యశ్రీ
1వ తరగతి,
శారద స్కూలు, భీమిలి మండలం,
విశాఖపట్నం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన the family

జీవన సౌరభం

గమ్యం ఎంత ఎత్తులో ఉన్నా,
దాన్ని చేరుకునే మార్గం
కిందనుంచే మొదలవుతుంది.

సరిహద్దు చెంత కన్నీటి కథలు ..!

పహల్గామ్‌లో జరిగిన ఘోరం ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. బాధితులకు తీరని శోకం మిగిల్చిన ఈ దుశ్చర్యని ప్రజలందరూ తీవ్రంగా ఖండించారు. దు:ఖం, ఆవేదన ఒక్కసారే చుట్టుముట్టిన మృతుల కుటుంబాలకు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. అయితే ఇదంతా ఘటనకి ఒకవైపు పార్శ్వం. ఇప్పుడు ఘటనకి రెండో పార్శ్వం గురించి చర్చించుకోవాలి. 'దాయాది దేశం అండతోనే దుండగులు ఈ దుశ్చర్యకి పాల్పడ్డారు కాబట్టి, భారత్‌లో ఉన్న పాకిస్తానీయులు గంటల వ్యవధిలో ఈ దేశం విడిచి పోవాలని పాలకులు హుకుం జారీచేశారు. సరిహద్దు మూసేసిన తరువాత ఈ దేశంలో ఇంకా ఉన్నట్లైతే జరిమానాతో కూడిన శిక్ష విధిస్తామ'ని తెగేసి చెప్పారు. ఈ ఆదేశం ఇప్పుడు వేలాది కుటుంబాలను విచ్ఛిన్నం చేసింది.



ఒకప్పుడు వాఘా సరిహద్దు ఇరు దేశాల మధ్య మిత్రబంధాన్ని పెంచితే ఇప్పుడు అదే సరిహద్దు తల్లిని పిల్లలకు దూరం చేసింది. భార్యభర్తలని విడదీసింది. అనారోగ్యం పాలైన అభాగ్యులకు వైద్యం అందకుండా వెనక్కి పంపేసింది. కళ్ల నిండా నీళ్లతో, దు:ఖాన్ని దిగమింగుకుంటూ వాఘా సరిహద్దు వద్ద బారులు తీరిన లైన్లలో ఎందరో అమ్మలు, బిడ్డలు, ఆలుమగలు అక్కడ కనిపించారు. ఒక్కొక్కరిది ఒక్కో విషాదకథ. గుండెని పిండేసే వ్యథ..

సనా భారతీయురాలు. 2020లో తన అత్త కొడుకు పాకిస్తాన్ కరాచీలో ఉంటున్న పౌరుడ్ని పెళ్లి చేసుకుంది. ఆ దంపతులకు ఇద్దరు బిడ్డలు. మూడేళ్ల ముస్తఫా, ఏడాదిన్నర వయసున్న మహనూర్. ఏప్రిల్ 14న సనా, మీరట్‌లో ఉంటున్న తన పుట్టింటికి పిల్లలతో కలసివచ్చింది. పెళ్లయ్యాక ఆమె భారత్‌కి రావడం ఇది రెండోసారి. 45 రోజుల వీసా గడువుతో ఇండియాలో అడుగుపెట్టిన సనా, పహల్గామ్ దాడి తరువాత పాలకులు ఇచ్చిన ఆదేశాలతో 11 రోజులకే పాకిస్తాన్‌కి తిరుగుముఖం పట్టింది. వాఘా సరిహద్దుకి చేరింది. అక్కడ వారి గుర్తింపు పత్రాలు పరిశీలించిన అధికారులు, సనాకి భారతీయ పౌరసత్వం ఉన్న కారణంగా తనని ఆపేశారు. పిల్లలకు పాకిస్తాన్ పౌరసత్వం ఉంది కాబట్టి వారిని సరిహద్దు దాటించారు. వివాహం అయి 9 ఏళ్లుపూర్తయితేనే సనాకి పాకిస్తాన్ పౌరసత్వం వస్తుంది. కాబట్టి తనకి ఇంకా ఆ దేశ గుర్తింపు కార్డు రాలేదు. ఇప్పుడు సనా తన ఇద్దరు బిడ్డలకి దూరమైంది. పిల్లలిద్దరూ భర్తతో, సనా ఒక్కత్తే పుట్టింట్లో ఉండిపోవాల్సిన పరిస్థితులు వచ్చాయి.

అమ్మ లేకుండా.. అనారోగ్యంతోనే..

17 ఏళ్ల మహ్మద్ అయాన్, ఎస్‌యువి వ్యాన్‌లో ఓ మూలన కూర్చొని ఉన్నాడు. ఏడ్చి ఏడ్చి అతని కళ్లు వాచిపోయి ఎర్రగా ఉన్నాయి. వైద్యం కోసం అయాన్ ఇండియాకి వచ్చాడు. రెండేళ్ల క్రితం జరిగిన ఓ యాక్సిడెంట్‌లో అతని శరీరం చచ్చుపడిపోయింది. వీల్‌ఛైర్‌కే పరిమితమైన కొడుకుకి మంచి చికిత్స చేయించుకోవాలని తల్లి అతన్ని తీసుకుని మార్చి 17న ఇక్కడికి వచ్చింది. ఆస్పత్రిలో అతనికి మెరుగైన వైద్యం అందుతోంది. ఉరుము మీద పిడుగులా పహల్గామ్ దాడితో అయాన్, అతని ముగ్గురు అక్కల పాకిస్తాన్ వీసాలు రద్దయ్యాయి. ఇప్పుడు వారంతా బలవంతంగా ఈ దేశం వీడుతున్నారు. ఇక్కడ ఇంతకంటే విషాదం ఏంటంటే, అయాన్, అతని అక్కలు, వాళ్ల అమ్మ లేకుండా పాకిస్తాన్‌కి పయనమయ్యారు. పాకిస్తాన్ పౌరుడ్ని పెళ్లి చేసుకున్న అయాన్ వాళ్ల అమ్మ భారతీయురాలు. ఆమెకి ఇక్కడ పౌరసత్వం ఉంది.

అమ్మని వదిలివెళ్తున్న అయాన్ చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నాడు. 'ఇప్పుడు నేను ఒంటరిగా ఇంటికి వెళ్లాలి. అక్కడ అమ్మ లేదు. ఈ బాధ, నా అనారోగ్యం కంటే నన్ను ఎక్కువగా బాధపెడుతోంది' అంటూ అయాన్ ఏడ్వడం చూసిన అతని అమ్మ, అక్కలు ఒక్కసారిగా ఘొల్లుమన్నారు.

నా వాళ్లతో మనస్ఫూర్తిగా మాట్లాడనేలేదు..

10 ఏళ్లుగా వీసా కోసం దరఖాస్తులు చేసుకుని, ఇటీవలే తన పుట్టింటికి చేరింది 52 ఏళ్ల సలీమున్నిసా. 'అక్కాచెల్లెళ్లతో సంతోషంగా గడపాలని ఎన్నో కలలు కన్నాను. ఇష్టమైన ఆహారం వండించుకోవాలనుకున్నాను. అమ్మ తరపు బంధువులందరినీ కలవాలనుకున్నాను. కానీ ఇప్పుడవేమీ జరగలేదు. రోజుల వ్యవధిలోనే ఉన్న ఫళంగా వెనుదిరిగాను. మళ్లీ నా వాళ్లని ఎప్పుడు కలుస్తానో తెలియదు' అంటూ విచారంగా ముఖం పెట్టిన సలీమా లాంటి వాళ్లు అక్కడ ఎంతోమంది.

మేము లేకుండానే మా బిడ్డ పెళ్లవుతోంది..

55 ఏళ్ల సింధు కార్వర్ భారతీయ హిందూ మహిళ. పాకిస్తాన్ పౌరుడ్ని పెళ్లి చేసుకుంది. ఏప్రిల్ 29న జోధపూర్‌లో తన కూతురు వివాహం చేయాలని సింధు కుటుంబమంతా భారత్‌కి వచ్చింది. పెళ్లికి అన్నీ సిద్ధం చేసుకున్నాక వాళ్ల వీసాలన్నీ రద్దయ్యాయి. పెళ్లికూతురు భారత్‌లో పుట్టింది కాబట్టి, ఆమెకి ఈ దేశ పౌరసత్వం ఉంది. దీంతో ఆమెని అక్కడే వదిలి 1000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఆ కుటుంబం వాఘా బోర్డర్ చేరుకుంది. అక్కడ అదే పనిగా ఏడుస్తున్న సింధుని ఓదార్చడం అక్కడున్న వాళ్ల తరం కావడం లేదు. 'కూతురు పెళ్లి ఎంతో సంతోషంగా చేయాలనుకున్నాం. డిసెంబరులోనే ఇక్కడికి వచ్చాం. షాపింగ్ చేశాం. బంధువులందరినీ పిలిచాం. రెండు రోజుల్లో పెళ్లి ఉందనగా 'పాకిస్తాన్ దేశీయులు దేశం విడిచి వెళ్లిపోవాల'న్న వార్తలు చూశాం. కాశ్మీర్‌లో ఏం జరిగిందో నాకు తెలియదు. ఈ రాజకీయాలు అర్థం చేసుకునేంత పరిణతి నాకు లేదు. నాకు తెలిసిందల్లా ఒక్కటే.. ఇప్పుడు మేము లేకుండానే మా కూతురు పెళ్లి జరగబోతోంది. ఏ తల్లికీ నాలాంటి పరిస్థితి రాకూడదు' అని సింధు ఏడ్వడం తన మేలిముసుగులోంచి స్పష్టంగా కనిపిస్తోంది.

ఇలాంటి ఎన్నో విషాదాలు వాఘా సరిహద్దు వద్ద కనిపించాయి. ఉన్మాదం నిండిన వ్యక్తులు చేసిన, చేస్తున్న దుశ్చర్యలు బతికున్న వాళ్లని కూడా జీవచ్ఛవాలుగా చేస్తున్నాయి. వేలాది కుటుంబాలని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు అన్ని వయసుల వారు ఈ విపరీతాలకు తల్లడిల్లిపోతున్నారు.




కాంబో రిపీట్ అవ్వతుందా!

రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న వార్తలు కొన్ని రోజులుగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఈ వార్తలను నిజం చేస్తూ మూవీ టీమ్ హింట్ ఇచ్చింది. ఈ మేరకు మొదట మైత్రి మూవీ మేకర్స్, డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ HMMLetsee అంటూ 'ఎక్స్' వేదికగా రష్మికను ట్యాగ్ చేశారు. దీనిపై స్పందించిన రష్మిక 'యస్ గాయ్స్' అంటూ రిప్లై ఇచ్చింది.



హ్యాట్రిక్ కాంబో సెట్ అయ్యిందా!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా కొత్త సినిమా సెట్స్ మీదకెళ్లనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాకు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా ప్రారంభమైంది. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది. ప్రస్తుతం ఇతర ఆర్టిస్టుల సెలెక్షన్‌లో ఉన్నారు టీమ్. ఈ సినిమాలో చిరుకి జోడీగా ఇద్దరు కథానాయికలు కనిపించనున్నట్లు ఇప్పటికే చిత్ర బందం నుంచి హింట్ అందింది. అందులో ఓ పాత్ర కోసం నయనతారను సెలెక్ట్ చేసే దిశగా అనిల్ రావిపూడి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై నయన్‌తో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. గతంలో వీరిద్దరూ సైరా నరసింహారెడ్డి, 'గాడ్ ఫాదర్' సినిమాల్లో కనిపించారు. ఇక ఈ చిత్రంలో మరో హీరోయిన్ పాత్రకు యువ కథానాయికను ఖరారు చేయనున్నట్లు సమాచారం. అనిల్ స్టైల్ వినోదం, యాక్షన్, కుటుంబ అంశాలతో అల్లుకున్న కథతో రూపొందనున్న చిత్రమిది. ఇందులో శివ శంకర వరప్రసాద్‌గా తన ఒరిజినల్ పేరుతో ఉన్న పాత్రలో కనిపించనున్నారు చిరంజీవి. హీరో వెంకటేశ్ కూడా ఇందులో అతిథి పాత్రలో కనిపిస్తారని సమాచారం.



మే 10న ఓటీటీలో

నితిన్ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కించిన 'రాబిన్ హుడ్' చిత్రం మే 10 నుండి ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. స్ట్రీమింగ్ హక్కులు జీ5 వారు సొంతం చేసుకున్నారు. ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించింది.

ముంబైలో అల్లు అర్జున్



కథానాయకుడు అల్లు అర్జున్ ముంబైలో సందడి చేశారు. ప్రతిష్టాత్మక వేవ్స్ సమ్మిట్ 2025కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు కామెంట్లు కూడా చేశారు. సినీరంగంలో తనకు మావయ్య మెగాస్టార్ చిరంజీవినే ఆదర్శమని ప్రకటించారు. పుష్ప 2తో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన అల్లు అర్జున్ ప్రస్తుతం జవాన్ డైరెక్టర్ అట్లీతో కొత్త సినిమా చేస్తున్నారు. ఈ సినిమా బన్నీ కెరీర్‌లో 22వ చిత్రంగా రానుంది. ముంబై ఎయిర్‌పోర్టులో అభిమానులు సెల్ఫీల కోసం వెంటపడగా 'నో' అంటూ అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు.



ఓవర్సీస్‌లో హిట్ 3 మూవీ హవా

కథానాయకుడు నాని నటించిన హిట్ 3 మూవీ మనదేశంతోపాటుగా విదేశాల్లోనూ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. గురువారంనాడు విడుదలైన ఈ సినిమా పైరసీ బారిన పడినా థియేటర్లలో ప్రేక్షకులు కూడా చూస్తున్నారు. ఈ క్రమంలోనే నాని మరో రికార్డు సాధించారు. గత కొన్నాళ్ల నుంచి తన ప్రతి సినిమాతో ఆకట్టుకుంటున్న నాని ఓవర్సీస్‌లోనూ తెలుగు ప్రేక్షకులను బాగా ఎంటర్‌టైన్ చేస్తున్నారు. హిట్ 3తో వరుసగా 11వ సారి మిలియన్ మార్క్ వసూళ్లు సాధించారు. ఈ క్రమంలోనే మహేష్‌బాబు సరసన చేరారు. మరోవైపు 5 కంటే ఎక్కువగా 1.5 మిలియన్ డాలర్ వసూళ్లు సాధించిన కథా నాయకుడిగా నిలిచారు. ఈ లిస్టులో ఇంతకుముందు మహేష్‌బాబు, ప్రభాస్, అల్లు అర్జున్, ఎన్టీఆర్ ఉన్నారు. ఇప్పుడు నాని కూడా చేరిపోయారు. త్వరలోనే 'ద పారడైజ్' అనే మూవీలో నటించ బోతున్నారు.ఇది పూర్తయ్యాక డైరెక్టర్ సుజీత్‌తో ఇంకో మూవీ చేయబోతున్నారు.

భళా బెంగళూరు

- గెలుపు ముంగిట చెన్నై బోల్తా
- ఆయుష్ సెంచరీ మిస్ • జడేజా పోరాటం వృథా
- రొమారియో 14బంతుల్లోనే అర్ధసెంచరీతో రికార్డు
- సూపర్‌కింగ్స్‌పై గెలుపుతో టాప్‌లోకి ఛాలెంజర్స్



కోహ్లి, బేతెల్ అర్ధసెంచరీలు

బెంగళూరు: ఎం. చిదరంబరం స్టేడియంలో చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఐపిఎల్ మ్యాచ్‌లో బెంగళూరు విజయం సాధించింది. 214పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 211పరుగులే చేసింది. చివరి ఓవర్లో గెలుపుకు 15పరుగులు చేయాల్సిన దశలో బెంగళూరు బౌలర్ యశ్ దయాల్ అద్భుతం చేశాడు. తొలి మూడు బంతులకు 9పరుగులు ఇచ్చినా.. ఆ తర్వాతి 3బంతులకు 3పరుగులే ఇచ్చి బెంగళూరు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. చెన్నై ఓపెనర్ ఆయుష్(94)కి తోడు జడేజా(77నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. బెంగళూరు బౌలర్లు ఎన్గిడికి మూడు, యశ్ దయాల్, కృనాల్ పాండ్యాకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రొమారియో షెఫర్డ్‌కు దక్కింది. అంతకుముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్ రొమారియో షెఫర్డ్ విధ్వంసం సృష్టించాడు. కేవలం 14బంతుల్లోనే అర్ధసెంచరీ కొట్టి రికార్డు నెలకొల్పాడు. ఈ సీజన్‌లో తక్కువ బంతుల్లోనే అర్ధసెంచరీ కొట్టిన బ్యాటర్‌గా షెఫర్డ్ నిలిచాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 213పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టులో విరాట్ కోహ్లీ (62; 33బంతుల్లో, 5 ఫోర్లు, 5 సిక్సులు), జాకబ్ బెతెల్ (55; 33బంతుల్లో; 2సిక్సర్లు, 8ఫోర్లు) ఓపెనింగ్ జోడీ శుభారంభాన్ని అందించింది. వీరిద్దరూ అర్ధ సెంచరీలతో రాణించి తొలి వికెట్‌కు 97పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత మిడిలార్డర్‌లో బెంగళూరు స్కోర్‌బోర్డు నెమ్మదించింది. దీంతో 17.4ఓవర్లు ముగిసేసరికి బెంగళూరు జట్టు 5వికెట్లు కోల్పోయి 157పరుగులే చేసింది. చివరి 14బంతుల్లో రొమారియో షెఫర్డ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 14 బంతుల్లోనే 6 సిక్సులు, 4 ఫోర్లు బాది 53పరుగులు చేశాడు. తద్వారా ఐపిఎల్‌లో రెండో వేగవంతమైన అర్ధశతకం బాదిన రికార్డు నెలకొల్పాడు. పడిక్కల్(17), పటిదార్(11), జితేశ్ శర్మ(7), టిమ్ డేవిడ్(2నాటౌట్) పరుగులు చేశారు. చెన్నై బౌలర్లలో పథీరణకు మూడు, సామ్ కరన్, నూర్ అహ్మద్‌లు తలో వికెట్ తీశారు. ఈ సీజన్‌లో ఒక జట్టు చివరి 42బంతుల్లో 304.78సగటుతో 128పరుగులు చేయడం, ఇందులో 10ఫోర్లు, 13సిక్సర్లు నమోదు కావడం ఇదే తొలిసారి.

స్కోర్‌బోర్డు...

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: బేథెల్ (సి)బ్రెవీస్ (బి)పథీరణ 55, కోహ్లి (సి)ఖలీల్ అహ్మద్ (బి)సామ్ కర్రన్ 62, పడిక్కల్ (సి)జడేజా (బి)పథీరణ 17, పటీదర్ (సి)సామ్ కర్రన్ (బి)పథీరణ 11, జితేశ్ శర్మ (సి)బ్రెవీస్ (బి)నూర్ అహ్మద్ 7, టిమ్ డేవిడ్ (నాటౌట్) 2, షెఫర్డ్ (నాటౌట్) 53, అదనం 6. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 213పరుగులు. **వికెట్ల పతనం:** 1/97, 2/121, 3/144, 4/154, 5/157 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-0-65-0, కంబోజ్ 3-0-25-0, నూర్ అహ్మద్ 4-0-26-1, జడేజా 3-0-26-0, సామ్ కర్రన్ 3-0-34-1, పథీరణ 4-0-36-3.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: ఆయుష్ మాత్రే (సి)కృనాల్ పాండ్యా (బి)ఎన్గిడి 94, రషీద్ (సి)షెఫర్డ్ (బి)కృనాల్ పాండ్యా 14, సామ్ కర్రన్ (సి)జితేశ్ శర్మ (బి)ఎన్గిడి 5, జడేజా (నాటౌట్) 77, బ్రెవీస్ (ఎల్‌బి)ఎన్గిడి 0, ధోనీ (ఎల్‌బి)యశ్ దయాల్ 12, దూబే (నాటౌట్) 8, అదనం 1. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 211 పరుగులు.

వికెట్ల పతనం: 1/51, 2/58, 3/172, 4/172, 5/201

బౌలింగ్: కృనాల్ పాండ్యా 3-0-24-1, భువనేశ్వర్ కుమార్ 4-0-55-0, యశ్ దయాల్ 4-0-41-1, ఎన్గిడి 4-0-30-3, సుయాశ్ శర్మ 4-0-43-0, షెఫర్డ్ 1-0-18-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
బెంగళూరు	11	8	3	0	16	+0.48
ముంబయి	11	7	4	0	14	+1.27
గుజరాత్	10	7	3	0	14	+0.86
పంజాబ్	10	6	3	1	13	+0.27
ఢిల్లీ	10	6	4	0	12	+0.36
లక్నో	10	5	5	0	10	-0.32
కోల్‌కతా	10	4	5	1	9	+0.27
రాజస్తాన్	11	3	8	0	6	-0.78
సన్‌రైజర్స్	10	3	7	0	6	-1.19
చెన్నై	10	2	9	0	4	-1.11

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

ఐపిఎల్‌లో వేగంగా అర్ధసెంచరీలు...

13 : జైస్వాల్(రాజస్తాన్), కోల్‌కతాపై, 2023
14 : కెఎల్ రాహుల్(పంజాబ్), ఢిల్లీపై, 2018
14 : కమిన్స్(కోల్‌కతా), ముంబయిపై, 2022
14 : షెఫర్డ్(బెంగళూరు), చెన్నైపై, 2025

ఐపిఎల్‌లో నేడు

కోల్‌కతా నైట్‌రైడర్స్ × రాజస్తాన్ రాయల్స్
వేదిక: కోల్‌కతా; మ.3.30గం॥లకు

పంజాబ్ కింగ్స్ × లక్నో సూపర్ జెయింట్స్
వేదిక: ధర్మశాల; రా.7.30గం॥లకు

సుదీర్మన్ కప్ ఫైనల్‌కు చైనా

- నేడు టైటిల్‌కై కొరియాతో ఢీ

హాంగ్జౌ(చైనా): సుదీర్మన్ కప్ ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్ చైనా వరుసగా రెండో ఏడాది దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో చైనా జట్టు 3-0తో జపాన్‌ను చిత్తుచేసి 14వ సారి టైటిల్‌కు చేరువైంది. స్వదేశీ ప్రేక్షకుల ముందు జరిగిన తొలి మిక్స్‌డ్ డబుల్స్‌లో యన్‌జే-హంగ్ జంట 21-11, 21-17తో హిరోకీ-అరిసా జంటను చిత్తుచేసింది. పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ షి యుఖీ 21-8, 21-16తో 8వ ర్యాంకర్ కొడాయి నరోకాను ఓడించి 2-0 ఆధిక్యతలో నిలిపాడు. ఇక మహిళల సింగిల్స్‌లో చెన్ యుఫే 17-21తో యమగుచి చేతిలో తొలి సెట్ చేజార్చుకున్నా.. ఆ తర్వాత 21-9, 21-16తో మిగిలిన రెండు సెట్లను చేజిక్కించుకొని మ్యాచ్‌ను ముగించింది. ఆదివారం జరిగే ఫైనల్లో దక్షిణ కొరియాతో తలపడనుంది. రెండో సెమీస్‌లో కొరియా జట్టు 3-2తో ఇండోనేషియాను చిత్తుచేసి ఫైనల్‌కు చేరింది. రెండేళ్లకొకసారి జరిగే సుదీర్మన్ కప్‌ను ఆతిథ్య చైనా జట్టు రికార్డుస్థాయిలో 13సార్లు సాధించింది. ఈ క్రమంలో నాలుగేసిసార్లు దక్షిణాఫ్రికా, ఇండోనేషియా జట్లను ఓడించింది.



షి యుఖీ

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68